ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

స్టీల్‌ప్లాంట్‌ను ముంచేసే కుట్రలు ఆపాలి

సిపిఎం విశాఖ జిల్లా కమిటీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కును పూర్తిగా ముంచేసే కుట్రలను కేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయబోమని, అభివృద్ధి బాట పట్టిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులు, ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తున్నారని, రూ.500 కోట్లు ఇచ్చామని, మరో 2500 కోట్లు కేటాయిస్తున్నామని చెబుతున్నారని, రెండో బ్లాస్ట్ ఫర్నేస్ పనులు నవంబర్ నుంచి ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతున్నాయని విశాఖ ఉక్కు అధికారుల ద్వారా ప్రకటనలు చేయిస్తున్నారని జగ్గునాయుడు తెలిపారు. రెండో వైపున ఉక్కు ఉత్పత్తి చేయవలసిన కార్మికులను బయటకు గెంటేసే చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. 4070 మంది కాంట్రాక్ట్ కార్మికులను ఉన్నఫలంగా తొలగించడానికి సిద్ధ పడుతున్నారన్నారు. 2500 మంది పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరున, 500 మంది ఉద్యోగులను బదిలీల పేరున తగ్గించే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. ప్లాంటు తన ఉత్పత్తి సామర్థ్యాన్ని 3.4 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు పెంచుకుందని, ఈ నేపథ్యంలో అవసరమైన పర్మినెంట్ ఉద్యోగులను రిక్రూట్ చేయకుండా తొలగింపు మిగతా 2లో..

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1, 2, 3 తేదీల్లో నిరాహార దీక్షలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 1, 2, 3 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరాహార దీక్ష కార్యక్రమాలు జరుగనున్నట్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. శుక్రవారం అల్లిపురంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు మాట్లాడుతూ అనేక త్యాగాలతో, ప్రాణాలర్పించి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వబోమని అన్నారు. సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మరొకసారి ఆంధ్ర రాష్ట్రంలో కార్మిక వర్గం, ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటానికి సన్నద్ధమవుతున్నట్టు తెలిపారు. అందులో భాగంగా వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 2లో..

భేటీలో పాల్గొన్న వసుధా మిశ్రా, తదితరులు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై చర్చ

విశాఖలో హై లెవెల్ కమిటీ ఛైర్‌పర్సన్ వసుధా మిశ్రా అధ్యక్షతన తొలి భేటీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపైనా, అనుసరించాల్సిన విధానాలపైనా, ప్రమాదాల అనంతరం చేపట్టాల్సిన సహాయక చర్యలపైనా శుక్రవారం విశాఖ వేదికగా జరిగిన ప్రభుత్వ ఉన్నత స్థాయి (హై లెవెల్) కమిటీ తొలి భేటీలో మేధోమథన చర్చ జరిగింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, పరవాడ పారిశ్రామిక వాడల్లో ఇటీవల జరిగిన ప్రమాదాల నేపథ్యంలో ఏర్పడిన ఈ కమిటీ తొలి సమావేశానికి ఛైర్‌పర్సన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి వసుధా మిశ్రా హాజరయ్యారు. వివిధ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా సాంకేతిక సహాయాన్ని తీసుకోవాల్సి ఉందని, ప్రపంచ స్థాయి ఉత్తమ విధానాలను అవలంబించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సభ్యులు వివిధ అంశాలపై సలహాలు, సూచనలు అందజేశారు. ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికలో పొందుపరచాల్సిన అంశాలపై, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మిక శాఖ కార్యదర్శి ఎంఎం.నాయక్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విజయ్ కృష్ణన్, చెన్నయ్, తిరుపతి ఐఐటిల ప్రొఫెసర్లు, ఇతర సభ్యులు సలహాలు అందజేశారు.

ఘనంగా టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

వార్త 2లో..

పెట్టుబడుల ఆకర్షణపై సదస్సు

వార్త 2లో..

వైభవంగా వైశాఖి నృత్యోత్సవ్ ప్రారంభం

వార్త 2లో..

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

భగత్ సింగ్ జయంతి సందర్భంగా..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువ కిశోరం షాహిద్ భగత్ సింగ్ 117వ జయంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆంధ్రా యూనివర్సిటీలోని టిఎల్ఎన్ సభా హాల్‌లో నిర్వహించారు. 80 మంది యూనివర్సిటీ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి ఉరికంబమెక్కిన వీర కిశోరం భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువతరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆ మహనీయుని పోరాట మిగతా 2లో..

ఎస్‌డబ్ల్యుకు చెందిన 3600 గజాల స్థలంపై

ప్రభుత్వం ఆరా ?

సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న లావణ్యవేణి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన గతంలో వివాదాస్పద స్థలంగా ఉన్న సిరిపురం జంక్షన్‌లోగల 3600 గజాలను శుక్రవారం ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ బి.లావణ్య వేణి పరిశీలించారు. దీంతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నగరం నడిబొడ్డునగల అత్యంత ఖరీదైన ఈ స్థలంపై దృష్టిసారించినట్టు స్పష్టమవుతోంది. రాష్ట్ర శాఖ డైరెక్టర్‌ను తాజాగా ఈ స్థల పరిశీలనకు పంపి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సవ్యంగా లేనందున ప్రభుత్వ భూములపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. విశాఖలో ఇంకా విలువైన భూములు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఖాళీ స్థలాలపైనా ఎంపీ, ఎంఎల్‌ఎలతో నిఘా పెట్టించినట్లు తెలుస్తోంది.

సాంఘిక సంక్షేమ శాఖకు రూ.కోట్లు విలువ చేసే స్థలం

సిబిసిఎన్‌సి ట్రస్ట్ పేరు మీద ఉన్నట్టు ప్రచారం జరిగిన పైన తెలిపిన 3600 గజాల స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నాలు చేశారు. సిరిపురం జంక్షన్‌లోగల ఈ ప్రాంతంలో 18300 గజాల వరకూ ఒక వ్యక్తి పేర ఉండడంతో ఈ స్థలాన్ని సిబిసిఎన్‌సి క్లెయిమ్ చేసుకున్నా ఉపయోగం లేకపోయింది. దీనికి ఆనుకునే సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 3600 గజాలు కూడా ఉండడంతో సిబిసిఎన్‌సి స్థలం ఎలాగైతే ఆక్రమణకు గురైందని ఆరోపణలు ఉన్నాయో అందులో ఈ స్థలం కూడా అప్పట్లో కలిపేసుకునేందుకు ప్రయత్నాలు జరగ్గా డిపార్టుమెంట్ అధికారులు అప్రమత్తమై దీన్ని తమదిగా క్లెయిమ్ చేసుకుని సాధించారు. రెండేళ్ల క్రితమే స్థలాన్ని రక్షించుకోడానికి రూ.12 లక్షలు జగన్ ప్రభుత్వంలో పెన్సింగ్ కోసం వచ్చాయి. ప్రస్తుతం ఈ స్థలంపై రాష్ట్ర ప్రభుత్వం కళ్లు పడ్డాయన్న చర్చ సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో లొకేషన్ కచ్చితంగా వెల్లడికావడం కోసం డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డిజిపిఎస్) సర్వే కూడా చేపట్టారు. ఆ తర్వాత సాంఘిక సంక్షేమ శాఖ పూర్తిస్థాయిలో దీన్ని స్వాధీన పరుచుకుంది.

యుఎల్‌సి మిగులు భూమి

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) సర్వేలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్‌ను ముంచేసే కుట్రలు ఆపాలి

కుట్రలు చేయడం దారుణమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా రిటైర్ అయిన వారి స్థానంలో కొత్త నియామకాలు జరగలేదన్నారు. ఐదు వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగులు చేసే ఈ పనులన్నింటినీ కాంట్రాక్ట్ కార్మికులతోనే యాజమాన్యం చేయిస్తోందని, ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులపైనా వేటు వేస్తోందని తెలిపారు. ఉత్పత్తి కారకులైన ఆఫీసర్లను, పర్మినెంట్ ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, బదిలీలు చేసి స్టీల్ ప్లాంట్‌ను ఎలా అభివృద్ధి చేయగలరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే ప్లాంట్‌ను పూర్తిగా ముంచేయడానికి కుట్రలు చేస్తున్నట్టు ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే రంగంలోకి దిగాలన్నారు. విశాఖ ఉక్కు పూర్తిగా మునిగిపోక ముందే రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. విశాఖ ఎంపీ శ్రీ భరత్, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావులు కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపివేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1, 2, 3 తేదీల్లో నిరాహార దీక్షలు

నిరాహార దీక్షలు నిర్వహించడానికి అఖిలపక్ష సంఘాలు నిర్ణయించాయన్నారు. 1న యువజన, విద్యార్థులు, 2న గాంధీ జయంతి రోజున కేంద్ర కార్మిక సంఘాలు, 3న మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ దీక్షలు జరుగుతాయని తెలిపారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న విశాఖ స్టీల్ పరిశ్రమను కారు చౌకగా ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రజల ముందు దోషులుగా నిలబడవలసి వస్తుందన్నారు. అఖిలపక్షాన్ని వెంటనే ఢిల్లీకి తీసుకొని వెళ్లి స్టీల్ ప్లాంట్ అంశంపై చర్చించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.మల్లయ్య, సిఎఫ్‌టియుఐ జాతీయ నాయకులు ఎన్.కనకారావు, ఎఐసిటియు నాయకులు కె.శంకరరావు, ఎపిఎస్‌టియు నాయకులు కె.దేవా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె.రహిమాన్, సిఐటియు నాయకులు కె.కుమార్ మంగళం పాల్గొన్నారు

ప్రభుత్వం ఆరా ?

మిగులు భూములు గుర్తించడం జరిగింది. అందులో భాగంగా దసపల్లా హిల్స్ ప్రాంతం అంతా సీలింగు భూమి కిందే ఉండేది. తాజాగా చూస్తే ఇవన్నీ దురాక్రమణలకు గురయ్యాయి. ఇక్కడ గజం స్థలం రూ.లక్షల్లోనే ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రూ.కోట్లకు అధిపతులైన వారే సీలింగు భూములన్నిటినీ ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు. ఇక్కడ సాంఘిక సంక్షేమ శాఖకు 3600 గజాల స్థలం ఉందని సైతం సంబంధిత అధికారులకు రెండేళ్ల క్రితం వరకూ తెలియదు. సిబిసిఎన్‌సి స్థలంపై వివాదం రేగిన సందర్భంలో ఇక్కడ సాంఘిక సంక్షేమ శాఖకు ప్రభుత్వం 1980వ దశకంలో స్థలం ఇచ్చిందన్నది వెల్లడికావడంతో అధికారులు అప్రమత్తమై ఈ స్థలాన్ని స్వాధీన పరచుకున్నారు. రాష్ట్ర డైరెక్టర్‌తో పాటు విశాఖపట్నం జిల్లా ఎస్‌డబ్ల్యు డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌ఛార్జి రామారావు సిరిపురం జంక్షన్ వద్దగల తమ శాఖ స్థల పరిశీలనలో పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

స్ఫూర్తితో కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించాలన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జి.రాము, యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ, నాయకులు ఆర్.హర్షిత్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.అజయ్, బి.సాయి కుమార్, జిల్లా నాయకులు అఖిల్, గుణ, నరేష్, సునీల్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా శోభారాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా ఉప కమిషనర్ కె.శోభారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు అమెను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. దేవస్థానం ఇఇ సిహెచ్‌వి.రమణ, ఎఇఒ తిరుమలేశ్వరరావు శోభారాణికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శోభారాణి

వైభవంగా వైశాఖి నృత్యోత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (ఎన్‌ఎండిఎ) వ్యవస్థాపక అధ్యక్షులు బిఆర్ విక్రమ్ కుమార్ (గౌడ్) ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజుల వైశాఖి నృత్యోత్సవ్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ 16వ అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవాన్ని ఆదాయ పన్నుల శాఖ ఇన్వెస్టిగేషన్ విభాగ సహాయ సంచాలకులు శంకర్ పాండే, సూదగాని రవిశంకర్ నారాయణ్ దంపతులు, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణ మూర్తి, విఎండిఎ అధ్యక్షులు ఎంఎస్ఎన్.రాజు ప్రారంభించారు.

ఘనంగా టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు గీతం యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్న ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గీతం యూనివర్సిటీ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 425 మంది క్రీడాకారులతో పాటు 25 మంది అఫీషియల్స్, అంతర్జాతీయ అంపైర్లు, కోచ్‌లు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి, అంతర్జాతీయ క్రీడాకారుడు, అంతర్జాతీయ బ్లూబ్యాడ్జ్ అంపైర్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మను శ్రీభరత్ సన్మానించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గౌతమ్ రావు, గీతం స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ ఉపాధ్యాయన్, శివ శివాని స్కూల్స్ కరస్పాండెంట్ నీరజ్ కుమార్ సంపతి, అగ్రికల్చరల్ రిటైర్ జాయింట్ డైరెక్టర్ కె శ్రీకృష్ణమూర్తి, ఎస్ఎంఎస్ డెంటల్ చైర్మన్ బి.శ్రీధర్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి.వరప్రసాద్, ఒలింపియాన్ ఎంవి.మాణిక్యాలు, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షులు జెకె.నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కెమికల్స్, పెట్రో కెమికల్స్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణపై సదస్సు

మాట్లాడుతున్న పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో కెమికల్స్, పెట్రో కెమికల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం, ఔత్సాహికులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ద్వైవార్షిక అంతర్జాతీయ ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన ముందస్తు సమావేశం స్థానిక నోవాటెల్ హోటల్లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పొడవైన తీరప్రాంతంతో పాటు దిగుమతి, ఎగుమతిలో ముఖ్యమైన 6 ఓడరేవులు, 3 పారిశ్రామిక కారిడార్లు, భారీ ల్యాండ్ బ్యాంక్ గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 900 కిలోమీటర్ల జాతీయ రహదారి, రైల్వే నెట్‌వర్క్ కూడా ఉందని అన్నారు. పిసిపిఐఆర్ టేకాఫ్ చేయడానికి, మొత్తం ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఎంఎస్ఎంఇ రంగానికి ప్రత్యేక పార్కులను రూపొందించడానికి తగిన పెట్టుబడిదారున్ని గుర్తించాల్సి ఉందన్నారు. ఎపిలో కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ పరిశ్రమను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఏపీ -సహజ వనరులు, పెద్ద చమురు శుద్ధి కర్మాగారం ఉనికి, శక్తివంతమైన ఔషధ రంగం, అర్హత కలిగిన యువత, శ్రామిక శక్తి సమూహ లభ్యత గురించి ప్రస్తావించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం కొత్త ఔషధాల అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయగల ఆర్ అండ్ డి కోసం నిధులకు మెరుగైన ప్రాప్యతను అందించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. వైజాగ్‌లోని ఎయిర్ కార్గో సౌకర్యాలు వేగవంతంగా ఉండాలని అన్నారు. సమావేశంలో కేంద్ర రసాయనాలు, పెట్రో కెమికల్స్ కార్యదర్శి నివేదిత శుక్లా వెర్మ, సంయుక్త కార్యదర్శి దీపాంకర్ ఆరోన్, ఎం.సుదర్శన్ స్వామి, అదానీ గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎస్ఎం రీనర్జీ, మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ స్వామి, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డు సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ విశాఖపట్నంలోని నేవల్ డాక్ యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోరుకొండ సైనిక్ స్కూల్, ఖడక్వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఆయన ఫ్లాగ్ ఆఫీసర్‌గా 1990లో భారత నావికాదళంలో నియమించబడ్డారు. ఆయన గతంలో ఫ్లాగ్ ఆఫీసర్‌గా మునుపటి విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విరాట్‌తో సహా సముద్రంలో వివిధ హోదాలలో విస్తృతంగా సేవలందించారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్య మరమ్మతులు, పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించే సెవెరోడ్విన్స్క్‌గాను, రష్యాలో యుద్ధనౌక ప్రొడక్షన్ సూపరింటెండెంట్‌గాను పనిచేశారు. అంతేకాకుండా న్యూఢిల్లీలోని నేవల్ హెడ్ క్వార్టర్స్‌లో ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ ప్రాజెక్ట్స్ ప్రిన్సిపల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఫ్లీట్ మెయింటెనెన్స్ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

జనవరి 2022లో ఫ్లాగ్ ర్యాంక్‌కు ఉద్యోగోన్నతి పొందిన ఆయన అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ మెటీరియల్ (ఆధునికీకరణ), నాటా డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎఎస్‌డిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన న్యూఢిల్లీలోని నావికాదళ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ మెటీరియల్ (డాక్ యార్డ్ అండ్ రెఫిట్)గా విధులు నిర్వహించారు.

స్వచ్ఛత, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల అన్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం, ప్రభుత్వ విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛత, వ్యక్తిగత పరిశుభ్రతపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా స్వచ్ఛతా సేవాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కెజిహెచ్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సిహెచ్.శిరీష, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం విభాగాధికారి వివి.పతిరావునాయుడు, వ్యక్తిగత కార్యదర్శి వి.వెంకట రమణ, కళాశాల అధ్యాపక బృందం, ఇగ్నో అధ్యయన కేంద్రం కో - ఆర్డినేటర్ డాక్టర్ కెఎల్.శిరీష తదితరులు పాల్గొన్నారు.

1, 3 తేదీల్లో ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం విశాఖ జిల్లాలో లబ్ధిదారులందరికీ ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌లు వారి వారి ఇంటివద్దనే సకాలంలో పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించినారు. అక్టోబర్ నెలలో 2వ తేదీ (గాంధీ జయంతి) సెలవు దినం కావడం వల్ల పెన్షన్ పంపిణీ కార్యక్రమం 1, 3 తేదీల్లో జరుగుతుందని తెలిపారు.

నేడు సిఎంఆర్ సెంట్రల్‌లో టూవీలర్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ ఆధ్వర్యాన నగరంలోని సిఎంఆర్ సెంట్రల్ మాల్‌లో తలపెట్టిన ఆన్-గ్రౌండ్ టూ-వీలర్ ఎక్స్ఛేంజ్, లోన్ మేళా శనివారం ప్రారంభంకానుంది. హీరో, సుజుకి, టివిఎస్, యమహా, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి ఒయిఎంలు ఈ ఎక్స్ఛేంజ్, లోన్ మేళా కోసం శ్రీరామ్ ఫైనాన్స్‌తో భాగస్వామ్యం చేసుకున్నాయి. ఆ వివరాలను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎలిజబెత్ వెంకటరామన్ శుక్రవారం మీడియాకు తెలిపారు.

2న ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సీతమ్మధార/ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు రక్షణకు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ వచ్చేనెల 2న నిర్వహించే ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఆ రోజున డాబాగార్డెన్స్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిర్వహించే ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. శుక్రవారం ద్వారకానగర్‌లో విశాఖ సిటిజన్ ఫోరం మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఒక క్రమపద్ధతిలో ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం యత్నిస్తోందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వ పాలకులు కేంద్రం చర్యలను వ్యతిరేకించకుండా తలాడిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పథకాలకు, పాలనకు లక్షల కోట్లు

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమణమూర్తి

అప్పులు చేస్తున్నారని, అందులో రూ.పదివేల కోట్లను కేటాయించి, సొంతగనులు కేటాయిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ లాభాలబాట పడుతుందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం అలా చేయకుండా, కావాలనే ప్రయివేటుకు ధారాదత్తం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే 2500మంది ఉద్యోగులకు విఆర్ఎస్ ఇస్తామని, మరో 500మందికి ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు.ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును నాటి ప్రధాని పి.వి.నరసింహారావు జాతికి అంకితం చేశారని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ మెడలు ఒంచైనా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమాలకు ప్రజల నుంచి స్వచ్ఛంద మద్దతు ఉందని గుర్తు చేశారు. విశాఖ సిటిజన్ ఫోరం గౌరవ అధ్యక్షులు పి వెంకటరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వ ఉలాట చర్యలను కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు చైతన్యమై అడ్డుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ చేస్తున్న ఉక్కు రక్షణ ఉద్యమానికి విశాఖ సిటిజన్ ఫోరం మద్దతునిస్తుందన్నారు. సమావేశంలో ఫోరం అధ్యక్షులు పిఎస్ తిలక్, కార్యదర్శి పి. రామకృష్ణ, కోశాధికారి పి రాము పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు నిందితులకు ఆరు నెలల జైలు

ప్రజాశక్తి-సీతమ్మధార: ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఇద్దరు నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పుచెప్పినట్లు నాలుగో పట్టణ లా అండ్ ఆర్డర్ ఎస్ఐ వెంకటరావు తెలిపారు. రైల్వే న్యూ కాలనీ చెందిన భూలక్ష్మి, దుర్గాప్రసాద్‌లపై కొట్లాట కేసు నమోదైందన్నారు. దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేయగా, విచారణ చేసిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కె.శ్యామ్

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలివి. కొమ్మాది సేవానగర్‌లో కె.శ్యామ్ అనే వ్యక్తి ప్రయివేటు ఉద్యోగం చేస్తూ, తన కుటుంబంతో నివాసముం టున్నాడు. ఈ నెల 24న ఉదయం ఎప్పటిలాగే విధులకు వెళ్లిన శ్యాం తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శ్యాం భార్య పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాచ్‌సి కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వికలాంగ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : బక్కన్నపాలెంలోని ఏపి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శిక్షణ సంస్థ (టిసిపి) విద్యార్థి దొడ్డి జానకిరావ్(20) శుక్రవారం ఉదయం మృతి చెందాడు. సహచర విద్యార్థులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నం కైలాసపురం శాంతినగర్-1కు చెందిన జానకిరావు, టిసిపిలో ఐటిఐ కార్పెంటర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఆరోగ్యం బాగోలేక కొద్దిరోజుల క్రితం ఇంటికి వెళ్లి గురువారం మధ్యాహ్నం తిరిగొచ్చాడు. సాయంత్రం ఇతర విద్యార్థులతో కలిసి భోజనం చేశాడు. రాత్రి 9గంటలు వరకు సహచర విద్యార్థులతో కలిసి ఉన్న జానకిరావు, పడుకున్న కొద్దిసేపటి తర్వాత వాంతి చేసుకున్నాడని, శుక్రవారం ఉదయం అందరూ నిద్రలేచినా, జానకిరావు లేవకపోవడంతో వార్డెన్‌కు సమాచారమిచ్చారు. వార్డెన్, ప్రిన్సిపల్ భాస్కర్ చేరుకుని అంబులెన్స్ రావడానికి ఆలస్యం కావడతో ప్రైవేటు వాహనంలో కెజిహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని ప్రిన్సిపల్ తెలిపారు.

15లోగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందించండి

ప్రజాశక్తి- మాధవధార : విశాఖపట్నం పోర్ట్, కార్గో హ్యాండ్లింగ్ పెన్షనర్స్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్స్‌ను వచ్చేనెల 15లోగా అందజేయాలని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు తెలిపారు. దీనికోసం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ పరిపాలన విభాగంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా డిజిటల్ సర్టిఫికెట్స్‌ను పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికోసం పెన్షనర్లు ఆధార్ కార్డు, మొబైల్ ఫోను, బ్యాంకు అకౌంట్ నెంబరు, పిపిఒ నెంబరు కలిగిన పుస్తకాన్ని తీసుకెళ్లాలని సూచించారు. డిజిటల్ సర్టిఫికెట్ సమర్పించకుంటే నవంబర్ నెల పింఛను నిలిచిపోతుందన్నారు.

అమర్‌నాథ్‌ను కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి -పద్మనాభం : వైసిపి జిల్లా అధ్యక్షునిగా గుడివాడ అమర్‌నాథ్‌ను శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు జిల్లా పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. అమర్ హయాంలో జిల్లాలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కలెక్టరేట్/మాధవధార : ఎపిటిఎఫ్ ఆవిర్భవించి 80ఏళ్ల పూర్తయిన సందర్భంగా వచ్చేనెల 6,7, 8 తేదీల్లో విజయనగరం ఫూల్‌బాగ్ జె కన్వెన్షన్‌లో నిర్వహించే ఓక్ జూబ్లీ వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు తెలిపారు. శుక్రవారం మాధవధారలోని ప్రయివేటు హోటల్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు మహాసభలలో విద్యాప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారికత, పెన్షన్లు, నూతన విద్యా విధానం, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విద్యావిధానాలపైచర్చించి తీర్మానాలు చేస్తారన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయ ప్రగతి సంపాదకవర్గ సభ్యులు ఎ.ఎస్.నాయుడు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయ రావు, జాకబ్ సేవియర్, అల్లూరి, అనకాపల్లి జిల్లాల ప్రధాన కార్యదర్శులు వై జానకిరామ నాయుడు, వీరభద్రరావు, నాయకులు జోజిబాబు, పట్నాయక్ కృష్ణారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు, గోపాలపట్నంలో రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక వార్డు టిడిపి అధ్యక్షుడు నారిపిన్ని సత్తిరాజు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ, వార్డు పరిధిలో అభివృద్ధి పనులకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు చొరవతో రూ.34లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అనూష, బంగారు తులసిరామ్, అల్లం రమేష్, శ్రీకుమార్, కొల్లి అప్పారావు, అలజంగి శ్రీను, రొక్కం కొండలరావు, బొత్స శ్రీను, గౌరి, రామకృష్ణ, రాము, నాని, పొలాసపల్లి రమేష్, జివిఎంసి సిబ్బంది కార్యకర్తలు పాల్గొన్నారు.

అవయవ, దేహదానంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : అవయవ, దేహదానంపై అఖిల భారత అవయవ దాతల సంఘం, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక సన్ స్కూల్‌లో సంబంధిత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ ప్రతిఒక్కరూ అపోహలు వీడి, అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. అవయవ, దేహదాన చేయడం ద్వారా మరణించిన తర్వాత కూడా జీవించవచ్చని, అలాగే నలుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన, చైతన్య కలిగించేందుకు స్థానిక నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ముందుకు రావడాన్ని అభినందించారు. నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు రూ 5 వేలు

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సీతామహాలక్ష్మి

చెక్కును సీతామహాలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జి కన్యాకుమారి, ఐ సురేష్, నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎం.సూర్య శ్రీనివాస్, కె సన్నీ, ఆర్ బసవ కృష్ణమూర్తి, కె సురేష్‌కుమార్, అరుణ్ కుమార్, సన్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు

శాంతి ఆశ్రమం కబ్జాదారులను కఠినంగా శిక్షించండి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ తూర్పు నియోజకవర్గంలోని శాంతి ఆశ్రమం కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని జనసేన నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యోగా పేరుతో గౌతమ్, సిద్ధార్థ అనే వ్యక్తులు శాంతి ఆశ్రమానికి చెందిన ఆరున్నర ఎకరాల స్థలాన్ని కబ్జాచేసి, పలు కమర్షియల్ నిర్మాణాలు చేపట్టి లక్షలు సంపాదించారన్నారు. శాంతి ఆశ్రమాన్ని ఖాళీ చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతుండడంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సుప్రీంకోర్టు గడువిచ్చిన ఈనెల 30వ తేదీలోగా శాంతి ఆశ్రమం ఖాళీ చేయకుంటే, కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు సమావేశంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, శాంతి ఆశ్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత శిఖరాలకు.. : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -తగరపువలస : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని, పట్టుదలతో శ్రమిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మాజీ మంత్రి, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు శుక్రవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలనుజ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి జయసుమ మాట్లాడుతూ, మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. ఎస్‌టిఎల్ అడిషనల్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఇన్ఫి రెడ్డి, ఐటి సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణచైతన్య మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు ముత్తంశెట్టి షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.అవంతి విద్యాసంస్థలు ప్రచురించిన ప్రజ్ఞ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, బేసిక్ సైన్స్ అండ్ హ్యూమనిటీస్ విభాగాధిపతి జె ఆర్ జి పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు

ఘనంగా వివివి రెడ్డి శతజయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ అధ్యక్షులు వివివి రెడ్డి శతజయంతిని శుక్రవారం కళాశాల ఆవరణలో యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జి మధు కుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. వ్యాపారవేత్తగానే కాకుండా సేవా దృక్పథంతో వ్యవహరించేవారని, ఎంతోమంది ప్రతిభావంతులైన పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందించారన్నారు. ఆయన చూపిన మార్గంలోనే

నివాళులర్పిస్తున్న కాలేజీ యాజమాన్య ప్రతినిధులు

యాజమాన్యం నేటికీ నడుస్తోందన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణలో మెగా రక్తదానశిబిరం నిర్వహించగా, విద్యార్థులు పెద్దఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో సిపి ఆకస్మిక తనిఖీలు

పోలీస్‌స్టేషన్ సందర్శనలో సిపి శంకబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్‌స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు కేసుల ఫైల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత పిఎంపాలెం పోలీస్‌స్టేషన్ నుంచే ఎక్కువగా ఫిర్యాదు వస్తున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యలపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అవసరమైన చోట సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సివిల్ తగాదాలు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్ పరిధిలో ఎనిమిది బృందాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రజల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుబారిన పడకుండా అవగాహన పెంచాలన్నారు. యువత ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. విశాఖ నగరంలో రౌడీషీటర్లు ఉండడానికి వీల్లేదన్నారు.

మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌గా చక్రపాణి

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌గా భీంపల్లి చక్రపాణి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.మోహనరావు పార్వతీపురం బదిలీపై వెళ్లారు. చక్రపాణి ఐజి కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ, కక్షిదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

నేడు సన్యాసిరావు సంతాపసభ

గంగిరెడ్డి సన్యాసిరావు(ఫైల్)

ప్రజాశక్తి -గాజువాక : ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు గంగిరెడ్డి సన్యాసిరావు సంతాప సభ ఈనెల 28న శనివారం జగ్గు సెంటర్ సమీపంలోని లయన్స్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం కానున్న సంతాప సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజ శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు తదితరులు హాజరౌతారన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

కృష్ణంరాజుపేటలో లబ్ధిదారులతో కేంద్రబృందం సభ్యులు

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని సింగనబంద గ్రామ పంచాయతీ కృష్ణంరాజుపేట, మజ్జిపేట గ్రామాల్లో కేంద్ర ప్రతినిధుల బృందం శుక్ర వారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, గృహ నిర్మాణం, తదితర పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, ఉపాధి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

1న కేంద్ర బృందం వెల్లంకి సందర్శన

ప్రజాశక్తి- ఆనందపురం : సంసిద్ధ ఆదర్శ గ్రామంగా ఎంపికైన మండలంలోని వెల్లంకి పంచాయతీని వచ్చేనెల ఒకటిన కేంద్రబృందం పర్యటించి, పరిశీలించనుందని ఎంపిడిఒ జానకి తెలిపారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి, తాగునీటి సౌకర్యం, జల్‌జీవన్ మిషన్ పనులు, రోడ్లను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరపు శ్రీను, గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి (బాబి), చెన్నా సత్యం, కూటమి నాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం

గర్భిణులకు సామూహిక సీమంతాల్లో పాల్గొన్న శారద

ప్రజాశక్తి -ఆనందపురం : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లితోపాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని భీమిలి ఎమ్మెల్యే సతీమణి గంట శారద అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా 50మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి జయదేవి పాల్గొని మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారపదార్థాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని తీసుకోవాలన్నారు. అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ పి. జానకి, తహశీల్దార్ పేర్లి శ్యామ్ ప్రసాద్, సిడిపిఒ శ్రీదేవి, ఎంపిపి శారద ప్రియాంక, వైస్ ఎంపిపి ధనలక్ష్మి, మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమ, ఐసిడిఎస్ సూపర్వైజర్ పివి రత్నం, అంగన్వాడి సిబ్బంది కాసులమ్మ, పద్మ, ధనలక్ష్మి, జానకి రాఘువాణి, ప్రమీల అనిత, సరిత, రాజ్యలక్ష్మి, లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

డాక్‌యార్డు ఉద్యోగి మృతిపై నిరసన

- ఎబిసి వంతెనపై వాహన రాకపోకలకు అనుమతించాలని ఆందోళన

విజయనగర్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న డాక్‌యార్డు ఉద్యోగులు

ప్రజాశక్తి -ములగాడ : నేవల్, డాక్‌యార్డులో పనిచేస్తున్న రక్షణ రంగ ఉద్యోగులను ఎబిసి వంతెనపై రాకపోకలకు అనుమతించాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. షీలానగర్ వద్ద డాక్‌యార్డు ఉద్యోగి దిలీప్‌కుమార్ మరణంపై నిరసన వ్యక్తం చేస్తూ విజయనగర్ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రక్షణరంగ ఉద్యోగులనైనా ఎబిసి వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించాలని రెండు నెలలుగా రక్షణ మంత్రికి, నేవల్ ఉన్నతాధికారులకు, పార్లమెంట్ పిటిషన్ కమిటీకి, స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులు విధులకు వచ్చిపోయే ఉదయం సాయంత్రం వేళ్లలో భారీసంఖ్యలో హెవీవాహనాల రాకపోకలతో కిక్కిరిసిన డాక్‌యార్డు, షీలానగర్ రోడ్డులో ప్రయాణికం తప్పని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడడమే కాకుండా, తరచూ ప్రమాదాలకు గురవుతూ, రక్షణరంగ ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బిసి వంతెన పైనుంచి అక్కడ పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అనుమతిస్తున్న అధికారులు, తమను ఎందుకు వెళ్లనీయడం లేదని ప్రశ్నించారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న కుటుంబాలకు ఎవరు భరోసా,బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనకు సహకరించిన వందల సంఖ్యలో వాహనదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆందోళనకు యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, నాయకులు శేఖర్, కాశీం, భానోజీ, పరమేష్, నాగార్జున, రాజేష్, గణేష్, నాయుడు నేతృత్వం వహించారు.

రోడ్డు ప్రమాదంలో డాక్‌యార్డ్ ఉద్యోగి దుర్మరణం

ఘటనాస్థలిలో దిలీప్ మృతదేహం

గాజువాక/ములగాడ : విశాఖ నావెల్ డాక్‌యార్డ్ ఉద్యోగి ఎం. దిలీప్‌కుమార్ శుక్రవారం షీలానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. సాయంత్రం విధులు ముగించుకుని, పెందుర్తిలోని ఇంటికి వెళుతుండగా, డాక్‌యార్డు షీలానగర్ రోడ్డులో ప్రమాదానికి గురై మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సంఘటనా స్థలిలోనే మృతి చెందిన సహచర ఉద్యోగి దిలీప్‌కుమార్‌కు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించే ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి డాక్‌యార్డు విజయనగర్ గేటు వద్దకు చేరుకుని నిరసన, ఆందోళన చేపట్టారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గీతంలో ముగిసిన ఎఐసిటిఇ బూట్ క్యాంప్

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న గీతం విసి గౌతంరావు

ప్రజాశక్తి- మధురవాడ : వినూత్న ఆలోచనలే పెట్టుబడిగా యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వైఫల్యాల నుంచి పాఠాలను నేర్చుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. శుక్రవారం కేంద్ర విద్యాశాఖ, ఎఐసిటిఇ సంయుక్త ఆధ్వర్యాన వాద్వాని ఫౌండేషన్ సహకారంతో గీతం వేదికగా నిర్వహించిన ఐదురోజుల 'ఇన్నోవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (ఐడిఇ)' బూట్‌క్యాంప్ ముగింపు సభలో మాట్లాడుతూ, పారిశ్రామిక వేత్తలుగా మారాలనుకునే వారికి సవాళ్ళను ఎదుర్కొనే ధైర్యం, ఓపిక, కష్టపడేతత్వం అవసరమన్నారు. యువత ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్రప్రభుత్వం సైతం స్టార్టప్‌లకు నిధులు కేటాయిస్తోందన్నారు.
ఎఐసిటిఇ దక్షిణ ప్రాంత ఇండోవేషన్ అధికారి భీమారెడ్డి మాట్టాడుతూ గీతం సహ దేశంలోని 9 ఉన్నత విశ్వవిద్యాలయాలలో బూట్ క్యాంప్‌లు నిర్వహించినట్లు వెల్లడించారు. గీతం బూట్ క్యాంప్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన 233 మంది విద్యార్థులు, 14 మంది ఫ్యాకల్టీ మెంటార్స్ పాల్గొన్నారన్నారు. క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు గీతం విసి గౌతంరావు సర్టిఫికెట్లను అందజేశారు.

ఓక్రిడ్జిలో గ్లోబల్ వర్సిటీల ఫెయిర్

ప్రవేశాల కౌన్సిలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా శుక్రవారం గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ నిర్వహించారు. భారత్, అమెరికా, బ్రిటన్, చైనా, ఆస్ట్రేలియా, యూరప్, సింగపూర్, కెనడా తదితర దేశాలకు చెందిన 60కి పైగా ప్రఖ్యాత యూనివర్సిటీ ల ప్రతినిధులు ఈ ఫెయిర్‌కు హాజరయ్యారు. 500 మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.
విశ్వవ్యాప్తంగా ఏయే యూనివర్సిటీల్లో ఏ తరహా కోర్సులు ఉన్నవీ, ప్రవేశం పొందేందుకు అవకాశాలు, ఉపకార వేతనాలు ఎలా పొందవచ్చు తదితర అనేక అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను యూనివర్సిటీ ప్రతినిధులు నివృత్తి చేశారు. పలు యూనివర్సిటీలు, ప్రఖ్యాత విద్యాసంస్థల్లో పలువురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. స్కూల్ డైరెక్టర్ అమిత్ జైన్, ప్రిన్సిపాల్ శైల భమిడిపాటి పాల్గొన్నారు.

కంచరపాలెం సిఐగా చంద్రశేఖర్

ప్రజాశక్తి- మాధవధార : కంచరపాలెం లాండ్ అండ్ ఆర్డర్ సిఐగా వి.చంద్రశేఖర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1998 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన చంద్రశేఖర్, విజయనగరం జిల్లా బలిజిపేట, సాలూరు, కొమరాడ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. 2010లో సిఐగా ఉద్యోగోన్నతి పొంది కొత్తవలస, విజయనగరం, పలాస, రణస్థలం తదితర ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం విశాఖ రేంజ్ విఆర్ నుండి కంచరపాలెం సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస, ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో శుక్ర వారం ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించిన కార్యక్రమంలో డాక్టర్ ఎఎస్ వీరమణి కార్తీక్, మెడికల్ ఎడ్యుకేషనల్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ బెత్యూన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎఒ పాల్గొన్నారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పెందుర్తి : విద్యార్థి దశలో పిల్లలు నేరాలు, చెడు వ్యవనాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తతతో పర్యవేక్షిస్తూ ఉండాలని ఎస్ఐ తాతబాబు అన్నారు. శుక్రవారం జివిఎంసి 92వ వార్డు బంటాకాలనీ అవగాహన సదస్సును నిర్వహించారు. కాలనీలో అపరిచిత వ్యక్తులు సంచారం, ఆకతాయి చేష్టలపై ఫోను ద్వారా సమాచారమిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రెసిడెంట్ అప్పలరాజు, సెక్రటరీ జి ఆనంద్, బి చిన్నబాబు పాల్గొన్నారు

తహశీల్దార్ బదిలీ

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం తహశీల్దార్ ఎం.ఆనందకుమార్‌ను పెందుర్తి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త తహశీల్దార్‌గా ఆనందకుమార్‌ను నియమించారు. ఆయన విధుల్లో చేరాల్సి ఉంది. కాగా మండలానికి ఇతర మండలాల నుంచి ఎనిమిది మంది విఆర్‌ఒలు బదిలీపై వచ్చారని తహశీల్దార్ ఆనందకుమార్ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు

బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -తగరపువలస: భీమిలి మండలం, దాకమర్రి పంచాయితీ అల్లుపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు టిడిపి మండల కమిటీ అండగా నిలిచింది. బాధిత కుటుంబాలైన అల్లు ముత్యాలు, అప్పన్న, లక్ష్మణలకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు, చీరలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు, నాయకులు సరగడ అప్పారావు, వై అనిల్ ప్రసాద్, ఎస్ ప్రకాష్ పాల్గొన్నారు

ఘనంగా 'కాయల' జన్మదిన వేడుకలు

తిరుమల శ్రీవారి సన్నిధిలో కాయల వెంకటరెడ్డి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపి మారిటైం బోర్డు మాజీ చైర్మన్ కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం తిరుమల శ్రీవారి సన్నిధిలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమల వెంకన్న ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించానన్నారు. పుట్టినరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కాగా. సీతమ్మధారలోని కెవిఆర్ ఎస్టేట్స్ సంస్థ కార్యాలయంలో కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను సూరారెడ్డి ఆధ్వర్యంలో సంస్థ సిబ్బంది ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి. కిరణ్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో 'ప్రేరణ'

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంబిఎ, ఎంసిఎ 2024-26బ్యాచ్ నూతన విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం ప్రసాద్‌రాజు మాట్లాడుతూ విద్యార్థి దశలో అశ్రద్ధ, నిర్లక్ష్యం చేయకుండా మంచి నైపుణ్యాలను నేర్చుకుని, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శంభుప్రసాద్, చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్ డాక్టర్ పిఎస్ రాజు, విభాగాధిపతి డాక్టర్ వి బాల పాల్గొన్నారు.

అనకాపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి

- వర్షం పడితే జలమయమవుతున్న అనకాపల్లిని కాపాడండి
- సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

వర్షాలు పడితే అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే అండర్ బ్రిడ్జి, సత్యనారాయణపురం శివారు కాలనీలోనూ, చోడవరం రోడ్డు జలమయమై ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారని, ఈ సమస్య నుండి అనకాపల్లిని కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఎం నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లికి అండర్ డ్రైనేజీ లేకపోవడం వలన, ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోతుందని తెలిపారు. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం వల్ల నీరు బయటకు వెళ్లకుండా వర్షం పడితే ఎక్కడికక్కడ నిలిచి పోవడంతో ప్రజలు ప్రయాణానికి తీవ్ర అసౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. చోడవరం రోడ్లోని రైల్వే అండర్ బ్రిడ్జి వర్షాకాలంలో నిండిపోవడంతో ఈ రహదారి గుండా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల లక్ష్మీదేవి పేట వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోవడంతో రైల్వే స్టేషన్, స్కూల్స్, హాస్పిటల్, మార్కెట్ తదితర అవసరాల నిమిత్తం అనకాపల్లి వచ్చే ప్రజలకు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిల్వ ఉన్న నీటి వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాళ్ళ తేలయ్య బాబు, బోప్పే ఉమా మహేశ్వరరావు, బి.నూక అప్పారావు, దాకారపు శ్రీనివాసరావు, పలక సత్యనారాయణ ఎస్.రాజబాబు పాల్గొన్నారు.

సన్యాసిరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా గాయకుడు సన్యాసిరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజా గాయకుడు, ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా నాయకులు జి.సన్యాసిరావు మృతి పట్ల సిపిఎం, ప్రజా సంఘాల ప్రతినిధులు, కళాభిమానులు హరిపాలెం గ్రామంలో గురువారం రాత్రి ఘనంగా నివాళులర్పించారు. సన్యాసిరావు చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకుడు బుద్ధ రంగారావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్యాసిరావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి గాయకుడు సీనియర్ ఉద్యమ నాయకుడు శరగడం కనుమునాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ప్రజానాట్యమండలి గాయకుడు ఆడారి ఆత్మారాము, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి ఎం రామ్ కుమార్, బాబురావు, సాగర్, మంగరత్నం, మణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కోడూరు -గోపాలపురం రోడ్డు నుండి పీతపాలెం గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద దాదాపు కోటి రూపాయల నిధులతో రెండు కిలోమీటర్ల రోడ్డును నిర్మించడం జరుతుందని తెలిపారు. కార్ర్యమంలో ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డిఒ చిన్ని కృష్ణ, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరం నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు

విద్యార్థులు చిన్ననాటి నుండే క్రీడలపై ఆసక్తి చూపించాలని, ఆటల్లో చురుకుగా ఉన్న విద్యార్థులు చదువుల్లో బాగా రాణిస్తారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను శు క్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేటర్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కొంత సమయం ఆటలకు వెచ్చించడం వల్ల దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, స్థానిక సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, టిడిపి నాయకులు పూడి నారాయణమూర్తి, రొంగలి మహేష్, జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆటలు పోటీలు శు క్రవారం ప్రారంభమయ్యాయి. ఈ వీటిని టిడిపి నేత, వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్, సీఐ రేవతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ఆటలు తోడ్పడతాయన్నారు ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంఈవోలు తలుపులు, నాగేంద్రకుమార్, సత్యనారాయణ, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలిరెడ్డి సత్యారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- చోడవరం : మాజీ మంత్రి, చోడవరం మాజీ ఎమ్మెల్యే బాలిరెడ్డి సత్యారావు ఆరవ వర్ధంతి సందర్భంగా పిఎస్ పేటలోని ఆయన స్వగ్రామంలో బలిరెడ్డి విగ్రహానికి శుక్రవారం పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చోడవరం ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏటువాక సత్యారావు, సిడిసి మాజీ చైర్మన్ కర్రి తమ్ము నాయుడు, వెంపలి ఆనందేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సానాపతి సత్యరావు, దన్నిన వెంకట్రావు, కోవెల జనార్దన్ రావు, ఓరుగంటి నెహ్రూ, హారిక రామకృష్ణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం ఎపి అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర సమక్షంలో అనకాపల్లి టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ ఎస్.భానుచందర్ (అఖి) మర్యాదపూర్వకంగా కలిశారు.

అచ్యుతాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఎలమంచిలి నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తీసుకువెళ్లారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా నాగేశ్వరరావు కలిశారు.

చెరుకుకు మద్దతు ధర రూ.4 వేలు ప్రకటించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : శనివారం జరగనున్న చోడవరం (గోవాడ) సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభలో టన్ను చెరకుకు మద్దతు ధర రూ.4000 వేలు ప్రకటించాలని ఎపి రైతు సంఘం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఏరియా కార్యదర్శి వనము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చెరకు రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.7 కోట్లు వెంటనే చెల్లించాలని, 2023-24 సంవత్సరంలో క్లైమ్ బకాయిలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలని, ఈ విషయంలో ఎంపీ సిఎం.రమేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సుగర్ ఫ్యాక్టరీలోని పంచదారను ప్రభుత్వం తీసుకొని పౌర సరఫరా శాఖ ద్వారా రేషన్ కార్డుదారులకు ఇవ్వాలని కోరారు. ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని, రైతులకు సబ్సిడీపై ఎరువులు, చెరుకు విత్తనాలు సరఫరా చేసి చెరుకు విస్తీర్ణం పెంచే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బదిలీ సిబ్బందికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేసి, బదిలీ అయిన డిటి వెంకట అప్పారావు, మండల సర్వేయర్ కె. శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ నాగభూషణం, టైపిస్ట్ వినయ్ కుమార్, పలువురు సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విఆర్ఒల సంఘ అధ్యక్షులు ఎస్టి.రామకాసు, ఆర్ఐ వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర -2047పై ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్వర్ణాంధ్ర-2047పై ప్రచార కార్యక్రమాన్ని జివిఎంసి 80, 81 వార్డుల పరిధి చాకలిపేట 20వ సచివాలయంలో శుక్రవారం డివిజన్ అధ్యక్షులు బిఎస్ఎంకె జోగి నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఎల్లపు జగన్నాథరావు, పీల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో కెజిబివి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- వడ్డాది : స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో వడ్డాది కెజిబివి విద్యార్థులు ప్రతిభ చూపించారు. భీమిలిలో శుక్రవారం జరిగిన అండర్ 19 విభాగంలో కెజిబివి విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాస్కెట్ బాల్ పోటీలో బాంధవ్య, ఫుట్‌బాల్‌లో పూజ, దీపిక ప్రతిభ కనబరిచారు. అలాగే గురువారం పరవాడలో జరిగిన అండర్ 19 విభాగంలో టెన్నికాయిట్ నుండి నిశ్విత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ తెలిపారు. మండల స్థాయి డిబేట్ పోటీలో కె.శ్రీలాస్య, ఎం రేవతి ఎంపికైనట్లు చెప్పారు. వీరిని స్కూల్ చైర్మన్ ఎడ్ల సత్యవేణి, పీఈటి ప్రవళిక ఇతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు

ప్రతిభ కనబర్చిన కెజిబివి విద్యార్థినులు

కబడ్డీ పోటీల విజేత విజయనగరం

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక మరిడిమాంబ పండుగ సందర్భంగా స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు గురువారం రాత్రి ముగిసాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీలలో విజేతగా విజయనగరం జట్టు నిలవగా, ద్వితీయ స్థానం విశాఖ, తృతీయ, చతుర్ధ స్థానాలలో గుంటూరు, శ్రీకాకుళం టీములు నిలిచాయి. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల జట్లు పాల్గొన్నాయి. విజేతలకు షీల్డ్‌లతో పాటుగా నగదును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేడ ప్రసాద్, వేగి కృష్ణ, ఆడారి గణపతి అచ్చం నాయుడు, కోనపల్లి రామ్మోహన్, ఆడారి రాంబాబు, పెంటకోట శ్రీనివాసరావు, ఆడాలి కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన విజయనగరం జట్టు ఇదే..

సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్‌కు ఐకెఎ అవార్డు

ప్రజాశక్తి-పరవాడ : ఎల్డ్రోక్ వారు ప్రతి ఏటా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన ఇండియా కె-12 ఎక్సపో (ఐకెఎ) అవార్డు ఈ ఏడాది స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మికి దక్కింది. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును సీతాలక్ష్మి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ స్కూల్‌ను అన్ని రంగాలలో అంతర్జాతీయస్థాయిలో నిలుపుటకు ఈ విధమైన ప్రోత్సహ అవార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అవార్డు గ్రహీత సీతాలక్ష్మికి పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి, డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ, సీఈఓ కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న సంస్కృతి స్కూల్ ప్రిన్సిపల్ సీతాలక్ష్మి

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విశ్వనాథ్ బ్లైపింగ్ ఇనిస్టిట్యూట్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు ప్రారంభించారు. రక్తదానం చేయడానికి అనేక అపోహలు ఉన్నాయని, రక్తం ఇవ్వడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.కిరణ్ కుమార్, ప్రభుత్వ వైద్యులు వినయ్ కుమార్, పలువురు డాక్టర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ రమేష్‌కు నాగజగదీష్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రైల్వేశాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌కు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. దీని వల్ల ముఖ్యమైన ట్రైన్‌లకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో హాల్టుకు అవకాశం కలుగుతుందని జగదీష్ పేర్కొన్నారు. రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో టిడిపి నాయకులు కొణతాల వెంకటరావు, డాక్టర్ కేకేవిఎ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, బోడి వెంకటరావు తదితరులున్నారు.

గిరిజన గ్రామాల్లో దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ పంచాయతీ పరిధి ముకుందపురం, బొడ్డపాడు, పాతబొడ్డపాడు, చిన్న సోంపురం, జుత్తాడ పాలెం, పలపకోడాపు, కొండ కోడాబు తదితర గిరిజన గ్రామాల ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేసిన దోమతెరలను శుక్రవారం పంపిణీ చేశారు. గిరిజనులు వర్షాకాలంలో విష జ్వరాలు, దోమల బారి నుండి రక్షించుకునేందుకు వీటిని పంపిణీ చేస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లెక్కల లింగన్న కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రాజా, పూజిత, టిడిపి నాయకులు ముసల తమ్మయ్య, మొసలి, పైడ్రాజు, శెట్టి మంగరాజు, జడ్డేటి రాము పాల్గొన్నారు.

కోడూరులో ఇది మంచి ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. 100రోజుల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. 82వ వార్డులో టిడిపి వార్డు ఇన్చార్జ్ పోలవరపు త్రినాథ్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

ఎంవిఆర్ తీర్థ యాత్రలు పునఃప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావుకు చెందిన ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య తీర్థయాత్రలు పునఃప్రారంభమయ్యాయి. శుక్రవారం చోడవరం నియోజకవర్గం కొత్తకోట గ్రామం తీర్థ యాత్ర బస్ బయలుదేరింది. ఈ యాత్రను నరసింగరావుపేటలోని తన స్వగృహం వద్ద ఎంవిఆర్ జెండా ఊపి ప్రారంభించారు. సింహాచలం, అన్నవరం, కనకమహలక్ష్మి అమ్మవార్ల ఆలయాలను యాత్రలో పాల్గొన్న భక్తులు దర్శించుకుంటారు. వీరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తీర్థయాత్ర బస్సును ప్రారంభిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

ఎసెన్షియా, సినర్జిన్

పరిశ్రమల యజమానులను అరెస్టు చేయాలి

సిఐటియు నేతలు రాము, సోమునాయుడు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఫార్మా కంపెనీల్లో ఇటీవల జరిగిన ప్రమాదాలకు సంబంధించి ఎసెన్షియా, సినర్జిన్ యాక్టివ్ పరిశ్రమల యజమానులను తక్షణమే అరెస్టు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోమనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎసెన్షియా పరిశ్రమలో ప్రమాదం జరిగి 17 మంది మృతి చెందగా, 39 మందికి తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాద సంఘటనపై ప్రభుత్వం నియమించిన హైలెవెల్ కమిటీ చైర్పర్సన్ వసుధామిశ్రా నేతృత్వంలో జరిగిన పరిశీలనలో పలు లోపాలు వెలుగు చూసినట్లు వారు పేర్కొన్నారు. పరిశ్రమలో మిడ్డెల్ ట్రైడ్ బ్యూ టైల్ లీకై ప్రమాదం జరిగిందని గుర్తించినట్లు తెలిపారు. లీకైన 10 నిమిషాల వరకు యాజమాన్యం, సిబ్బంది గుర్తించలేదన్నారు. లీకైన చోట పైప్‌లైన్ క్లోజ్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకున్నారని, ప్రమాదం జరిగితే తప్పించుకునే వ్యవస్థ పరిశ్రమలో లేదని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగితే నియంత్రణ చేసే వ్యవస్థ లేదని, నైపుణ్యం ఉన్న కార్మికుల లేరని హైలెవెల్ కమిటీ గుర్తించినట్లు తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు ఎంతమంది వారి వివరాలు లేనట్లు చెప్పారు. రసాయనాల పైప్ లైన్లు, విద్యుత్తు లైన్లు ఒకే వరుసలో ఉండడం వలన ప్రమాద స్థాయి పెరిగిందని కమిటీ సభ్యులు గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. పరిశ్రమ డిజైనింగ్ లోపం ఉన్నట్లు అధికారులు చెప్పినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు కమిటీలు పర్యటించడం సాధారణంగా జరుగుతుందని, మళ్లీ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను బయటపెట్టాలని భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మాక్ డ్రిల్ నిర్వహించి, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని, ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలపై కేసులు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

సముద్రంలో చేపలు మృత్యువాత

పూడిమడక తీరానికి కొట్టుకొచ్చిన వైనం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని పూడిమడక వద్ద సముద్రంలో చేపలు మృత్యువాత పడ్డాయి. అవి శుక్రవారం పూడిమడక సముద్రతీరానికి కొట్టుకొచ్చాయి. లక్షలాది రూపాయలు విలువ చేసే చేపలు ఇలా మృతి చెందడంపై మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎస్ఇజెడ్ పరిశ్రమలో విడుదల చేసే రసాయనిక వ్యర్థ పదార్థాలు సముద్రంలో కలవడం వలన సముద్ర జలాలు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితి తీర ప్రాంతాలలో తరచూ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయలు విలువచేసే చేపలు చనిపోతున్నాయని, దీంతో తమ జీవనాధారం పోతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు నేడు పరిశ్రమల వ్యర్థ రసాయనాల వల్ల వారి జీవనం ప్రశ్నార్థకంగా మారింది. పూడిమడక సముద్రతీరంలో శుక్రవారం కొట్టుకొచ్చిన చనిపోయిన చేపలను చూసి మత్స్యకారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే సముద్రంలోకి విడుదల చేస్తున్న రసాయనిక వ్యర్థ పదార్థాలను నిలుపుదల చేయాలని ఏపీ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు చేపల తాతయ్య ఆధ్వర్యంలో మత్స్యకారులు తీరంలో నిరసన తెలిపి నినాదాలు చేశారు. ప్రభుత్వం, పాలకులు వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

మృత్యు చేపల వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

గుడివాడను సన్మానిస్తున్న రవికుమార్ తదితరులు

బూడి, గుడివాడలను కలిసిన రవి కుమార్

ప్రజాశక్తి- సబ్బవరం : వైసిపి అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల అధ్యక్షులుగా నియమితులైన బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్నాథ్‌లను ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పివి సురేష్, ఇమ్రాన్, దొడ్డి కిరణ్, ఐడి.బాబు, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, ఎస్.అనిల్ తదితరులున్నారు.

తాతయ్యబాబుకు సత్కారం

ప్రజాశక్తి-వడ్డాది : రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా ఎంపికైన బత్తుల తాతయ్యబాబును బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో మండల విశ్వ బ్రాహ్మణ సాధికార సంఘం సభ్యులు, బిజెపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాతయ్య బాబుకి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో గిడుతూరి ఈశ్వరరావు, ఒంపోలు ఆచారి, బెన్నాబత్తుల పెంట బాబు, కందర్ప రమణమూర్తి ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో శుక్రవారం కురిసిన వర్షాలకు, గాలులకు పెదపాడు -కొసింకోట మార్గంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది వైర్లు బిగింపు పనిలో నిమగ్నమయ్యారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి -అచ్యుతాపురం

గ్రామాల్లో సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపిపి కోన సంధ్య అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, వ్యర్థపదార్థాలు గుట్టల గుట్టలుగా దర్శనమిస్తున్నాయని, రహదారులపై వర్షం, మురికి నీరు చెరువులను తలపించే విధంగా కనిపిస్తున్నాయని చెప్పారు. వీటిపై సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇలా అయితే సర్పంచ్‌గా మిమ్మల్ని ఎన్నుకోవడం ఎందుకని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గత సమావేశంలో ఇదే విషయం చెప్పినా కొంతమందిలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. పూడిమడక గ్రామాభివృద్ధికి ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పిటిసి లాలం రాంబాబు జెడ్పి కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, ఎంపీడీవో కె.ప్రభాకర్ రావు, డిప్యూటీ తహశీల్దారు నీరజ, నాయకులు దేశంశెట్టి శంకర్రావు, ఎం సంజీవ్, ఎస్ జువాలనాయుడు, కె విమల కుమారి, ఎస్ భాగ్యలక్ష్మి, పి వాసు, ధర్మరెడ్డి నాయుడు బాబు, సింహాద్రి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు రకాల పోటీలు

ప్రజాశక్తి-చోడవరం

స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమంలో భాగంగా రాబోయే ఐదేళ్లలో విద్యా రంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 17 పాఠశాలల నుండి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన- యమ్.రమేష్ (లక్ష్మీపురం జెడ్‌పి హైస్కూల్), వక్తృత్వంలో యస్.బింధు మాధవి (జన్నవరం జెడ్‌పి హైస్కూల్) డిబేట్‌లో కె.మౌనిక (చోడవరం జెడ్‌పి హైస్కూల్) విద్యార్థులు గెలుపొందారు. వారు శనివారం నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. నాయనిర్ణేతలుగా సన్నిబాబు, ఇస్మాయిల్, మణిమాల, రమేష్, సుష్మా దేవి, ఆర్.లక్ష్మి, యస్.క్రిష్ణ గంగాధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సింహాచలం, ఉపాధ్యాయులు రామిరెడ్డి, కెవియమ్.నాయుడు, రవి శంకర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి వ్యాసరచన, డిబేట్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుండి 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో వై.నందిని (కొరువాడ జెడ్‌పి హైస్కూల్), వక్తృత్వం, డిబేట్ పోటీల్లో వి.పవిత్ర, వై.కావ్యశ్రీ (కేజీబీవీ గొల్లలపాలెం) గెలుపొందారు. కార్యక్రమంలో ఎంఇఒలు కె.సత్యనారాయణ, డివిడి ప్రసాద్, జెడ్‌పి పాఠశాల హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : విశాఖపట్నం-దేవరాపల్లి ఆర్టీసీ బస్సు కండక్టర్ రాజేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న బస్సులో ఉన్న ప్రయాణికులు వెంటనే బస్సు ఆపి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నడిరోడ్డుపైనే రాజేశ్వరరావుకు సాలువ, పూలు, పండ్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కండక్టర్ సిహెచ్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఒక కండక్టర్‌ను ప్రయాణికులు సత్కరించడం ఇదే ప్రథమమని, తన ఉద్యోగంలో ఇంతవరకు సహకరించడమే కాకుండా తమ సేవలకు గుర్తింపు ఇవ్వడం ఆనందకరమని, ప్రయాణికులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కండక్టర్‌ను రోడ్డుపైనే సత్కరిస్తున్న ప్రయాణికులు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో శుక్రవారం పలువురు మండల స్థాయి అధికారులు బాధ్యతలు చేపట్టారు. తహసిల్దార్‌గా తిరుమలబాబు బాధ్యతలు చేపట్టారు. ఆయన చోడవరం మండలం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసిల్దార్ జానకమ్మ విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయానికి అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బదిలీపై వెళ్లారు. మండల పంచాయతీరాజ్ ఇంజనీర్ (ఇంచార్జ్) గా దుర్గాప్రసాద్ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం వి ఎస్ ఎస్ వర్మ రాయవరం బదిలీపై వెళ్లారు. మండల విద్యుత్ శాఖ ఇంజనీర్ గా పరమేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నారు. కోటవురట్ల ఉప తహసిల్దారుగా రమేష్ చీడికాడ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన అన్నాజీరావు నక్కపల్లి బదిలీపైవెళ్లారు. గ్రామీణ ఉపాధి హామీ ఏపీఓ గా నాగరాజు చీడికాడ మండలం నుండి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన గంగు నాయుడు చీడికాడ బదిలీపై వెళ్లారు. తహసిల్దార్ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్ గా కృష్ణ బదిలీపై వచ్చారు.

నర్సీపట్నం టౌన్ :నర్సీపట్నం నూతన ఎంపీడీవోగా కే. ఉషశ్రీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె శ్రీకాకుళం జిల్లా పోలంకి మండలం ఎంపీడీవోగా పని చేసి నర్సీపట్నం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయం సూపరిండెంట్ రమణ బాబు, సిబ్బంది ఆమెకి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఇంతవరకు ఇక్కడ ఎంపీడీవో గా పని చేసిన జయ మాధవి రాంబిల్లి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

గొలుగొండ:గొలుగొండ తహశీల్దార్‌గా పి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, మండలంలో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దార్‌కు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అదే విధంగా సర్వేయర్‌గా వి.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు.

బుచ్చయ్యపేట:బుచ్చయ్యపేట మండల తహశీల్దార్‌గా ఎం.లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరాపల్లి మండల తహశీల్దారుగా పనిచేస్తున్న లక్ష్మి సాధారణ బదిలీల్లో భాగంగా బుచ్చయ్యపేట మండలానికి బదిలీపై వచ్చారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

దేవరాపల్లి : దేవరాపల్లి మండల తహశీల్దార్‌గా పొన్నగంటి లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కలెక్టరేట్‌లో కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండలంలోని పలు శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఏలు లక్ష్మీదేవిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డిప్యూటీ తహశీల్దార్లు

దేవరాపల్లి : దేవరాపల్లి మండల డిప్యూటీ తహశీల్దార్ (డీటీ)గా కె.అప్పారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పాయకరావుపేట హెచ్ఎటీగా పనిచేస్తూ అప్పారావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఆర్ఐ, సర్వేయర్లు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్బవరం : సబ్బవరం మండల డిప్యూటీ తహశీల్దారుగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిహెచ్.అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అప్పారావు అనకాపల్లి ఆర్‌డిఓ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డిటిగా పని చేసిన వెంకట అప్పారావు రాంబిల్లి బదిలీపై వెళ్లారు.

మండల సర్వేయరు...

సబ్బవరం మండల సర్వేయర్‌గా ఎల్.అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మునగపాక నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సర్వేయర్‌గా పని చేసిన కె.శ్రీనివాసరావు పరవాడకు బదిలీ అయ్యారు. గొట్టివాడ సర్వేయర్‌గా జాన్, బాటజంగాలపాలెం సర్వేయర్‌గా వసంత, జూనియర్ అసిస్టెంట్‌గా పి.హరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారికి రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

బిక్కుబిక్కుమంటూ చదువులు

-శిథిలావస్థలో పాఠశాల భవనం

- ఆందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని పాత తంగేడు గ్రామంలో మండల పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు సైతం ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 36 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో రెండు భవనాలలో ఒక భవనం పూర్తిగా శిథిలం కావడంతో మిగిలిన ఒక్క భవనం, వరండాలో విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పాఠాలు చెబుతున్న గది కూడా శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులు మీద పడుతున్నాయి. అంతేకాదు విద్యార్థులకు ఏర్పాటు చేసిన వంటగది సైతం శిథిలావస్థలోనే ఉంది.అధికారులు స్పందించి కొత్త భవనాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరండాలో చదువుతున్న విద్యార్థులు

30న కోటవురట్ల మండల సమావేశం

ప్రజాశక్తి- కోటవురట్ల: ఈనెల 30న సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరగనుందని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. అన్ని శాఖల అధికారులకు, ఎంపిటిసి సభ్యులకు, సర్పంచులకు సమాచారం అందజేశామన్నారు.

ఉపమాకలో రాట వేస్తున్న అర్చకులు, నాయకులు

ఘనంగా దసరా రాటోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక దుర్గా దేవి ఆలయం వద్ద శుక్రవారం దసరా మహోత్సవాలకు సంబంధించి రాటోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలో అర్చకులు వెలవలపల్లి మహేష్ పూజలు నిర్వహించారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకూ ఉపమాక దుర్గా దేవి ఆలయంలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త వెంకటరమణ తెలిపారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, గురు భవాని దవరసింగి రాంబాబు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలో దసరా నవరాత్రుల ఉత్సవ రాట ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మోటార్ యూనియన్, ఉత్సవ కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు ఉత్సవ కమిటీ తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వరహాలు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చియ్యపేట మండలంలోని వడ్డాదిలో పొగాకు వర్తక సంఘం ఆధ్వర్యంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వడ్డాది బ్రాహ్మణ వీధిలో ఉత్సవ రాట ప్రతిష్ఠించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి బుచ్చయ్యపేట, సీతయ్యపేట గ్రామాల్లో శుక్రవారం దసరా ఉత్సవ రాటను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నందారావు తలుపులు నాయుడు, ఘంటా చిరంజీవి, గాడి సూరప్పారావు, సుంకర శ్రీను, గిల్లి జగన్నాథరావు పాల్గొన్నారు

పరవాడ : పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే దుర్గాదేవి నవరాత్రులు మహోత్సవాలు సందర్భంగా పందిరి రాట మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, చుక్క రాము నాయుడు, బండారు రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థ అధినేత నరసింహారావు

ఖోఖో జాతీయ స్థాయి పోటీలకు

శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:సి.బి.ఎస్.ఈ బోర్డు నిర్వహించే జాతీయస్థాయి ఖో -ఖో పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎంపికైనట్లు పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రిన్సిపల్ ఎం వి వి ఎస్ మూర్తి తెలిపారు. ఈ నెల 22 నుండి 26 వరకూ వి ఆర్ ఎస్ విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ స్కూల్ (బచ్చుపల్లి, తెలంగాణా)లో నిర్వహించిన క్లస్టర్ - 7 (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా) ఖో -ఖో పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అండర్ - 14 బాలుర విభాగంలో లాలం పూర్ణ శ్యాం నాయుడు టీం , అండర్ - 19 బాలుర విభాగంలో జి. ధనుష్ టీం ప్రథమ స్థానం లో నిలిచి బంగారు పతకాలు సాధించడమే కాకుండా అక్టోబర్ 16 నుండి 19 వరకూ ది సరదన ఇంటర్నేషనల్ స్కూల్ (దేవాస్, మధ్యప్రదేశ్) లో జరిగే జాతీయ స్థాయి ఖో -ఖో పోటీలకు ఎంపికయ్యారని, అండర్ -14 బాలికల విభాగంలో జి.కావ్యసుధ టీం తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలు సాధించారని ఆయన వెల్లడించారు. ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, కోచ్ లు చిరంజీవి, హేమ , ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేసారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

కొత్తకోటలో పదార్థాలు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -కొత్తకోట:గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ విజయ లక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం రావికమతం మండలం కొత్తకోట సెక్టార్ పరిధిలో 25 అంగన్వాడీ కేంద్రాలు సంయుక్తం గా కలసి కొత్తకోట గ్రామంలో సెక్టార్ సూపర్ వైజర్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు పోషక విలువలు వున్న ఆహార పదార్థాలను తయారు చేసి స్టాల్ రూపంలో పెట్టి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిఎం యస్ కె, రత్న కుమారి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండలంలోని చిన దొడ్డిగల్లు అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ పిఒ శ్రీవిద్య ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు సత్తిబాబు, మాజీ సర్పంచ్ వెలగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ సీతారామరాజు

1న శత శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:అక్టోబర్ 1న ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ నగదు పంపిణీ శత శాతం పూర్తిచేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఎంప్లాయిస్ క్లస్టర్ మ్యాపింగ్, బ్యాంకు నుండి పింఛన్ నగదు జాగ్రత్తలపై సమీక్షించారు. బ్యాంకు నుండి నగదు డ్రా చేసి పంచాయతీలకు తీసుకు వెళ్ళేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 1న ఉదయం 5 గంటల నుంచే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్ అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-కోటవురట్ల:గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సర్వ శిక్ష అభియాన్ కోఆర్డినేటర్ ఎల్ గిరిధర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గొట్టువాడ గ్రామ శివారు అనకు పాఠశాలకు గొట్టువాడ పాఠశాల నుంచి డిప్యుటేషన్ పై ఉపాధ్యాయుడును నియమించామని తెలిపారు.

పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్

ఆర్‌టిఒ సేవలను ప్రయివేటుపరం చేయొద్దు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ఆర్‌టిఓ సేవలను ప్రైవేటుపరం చేసే యోచనను విరమించాలని, లేకుంటే ఈ చర్యను తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని విశాఖపట్నం మోటారు ఆటో యూనియన్ (సిఐటియు)కార్యదర్శి జి. అప్పలరాజు, సహయ కార్యదర్శి పి.రాజ్ కుమార్ హెచ్చరించారు. ఆర్‌టిఓ సేవలు ప్రైవేటుపరం చేయటాన్ని వ్యతిరేకిస్తూ, శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అతి త్వరలో కూటమి ప్రభుత్వం ఆర్టీవో సేవలు ప్రైవేటుపరం చేయనుందని తెలిపారు. ఇప్పటికే పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, వీటితో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరిగి మోటార్ ట్రాన్సుపోర్టు కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెహికిల్స్ కి లైఫ్ టాక్స్,రెన్యువల్ ఫైనాన్స్ ఛార్జెస్ పెరిగాయని వీటిని చెల్లించలేక సతమతవుతుంటే కూటమి ప్రభుత్వం ఆర్టీవో సేవలు ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రతిపాదనను వెంటనే వెనుకకి తీసుకోవాలని, లేదంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ నిరసనలో భాగంగా, శనివారం ఆర్ అండ్ బి కార్యాలయం సమీపంలో ఉన్న ఆర్టీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్టీవో కు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న కార్మికులు

చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట:నిరుపేద కుటుంబాలకు ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం వరమని రావికమతం ఏపి గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ చాద్ర ప్రకాష్ సింగ్ అన్నారు. స్థానిక ఏపిజివిబి బ్యాంక్‌లో ఖాతా దారులుగా చేరి మరణించిన ఇద్దరు వ్యక్తుల కుటుంబ సభ్యులకు శుక్రవారం ఆయన భీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ, బ్యాంకులో ఖాతాదారుడైన పట్టిం నూకరాజు ప్రధానమంత్రి జీవనజ్యోతి భీ మా యోజన పథకంలో పాలసీ తీసుకు న్నారన్నారు. ఇటీవల ఆయన మరణించడంతో భార్యకు, రావికమతం గ్రామానికి చెందిన గంజి రాము మరణించడంతో నామిని సత్యవతికి రెండేసి లక్షల చెక్‌లను అందజేశామని తెలిపారు. ఏడాదికి కేవలం రూ. 436 లు చెల్లించి భీమా పొందాలని పేర్కొన్నారు.

విధుల్లో చేరిన వైద్యాధికారులు

ప్రజాశక్తి -కొత్తకోట: కొత్తకోట, రావికమతం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రజని, సురేఖ,దుర్గాప్రసాద్ శుక్రవారం విధుల్లోకి చేరారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల రిజర్వేషన్లు కుదింపునకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 85కు వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు విధులు బహిష్కరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వడంతో విధుల్లోకి తిరిగి చేరామని వైద్యాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

కాలువలో పడిన పాడి గేదె

-శ్రమించి బయటకు తీసిన గ్రామస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట:వీధి కాలువలో ప్రమాదవ శాత్తు పడిన పాడి గేదెను ప్రాణాపాయం నుంచి తప్పించిన సంఘటన రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ముచ్చకర్ల పెరినాయుడు పాడి గేదె గడ్డి మెస్తూ చిలకవానిపాలెం శ్మశాన వాటిక రహదారి కాలవలో ప్రమాదవ శాత్తు పడింది. బయటకు లేచే ప్రయత్నంలో కాలవ మధ్య లో ఇరుక్కు పోయింది. గ్రామస్తులు రెండు గంటల పాటు శ్రమించి పాడి గేదెను ప్రాణాలతో బయటకు తీశారు.

కాలువలో పడిన గేదె

మంత్రి నాదెండ్లను కలిసిన శివదత్

ప్రజాశక్తి- నక్కపల్లి:రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను విజయవాడ పౌర సరఫరాల కేంద్ర కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ మర్యాద పూర్వకంగా కలిసి గణపతి విగ్రహాన్ని బహూక రించారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల బోడపాటి శివదత్ నియమితులయ్యారు.

వినాయక ప్రతిమ ఇస్తున్న శివదత్

నక్కపల్లిలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గురువారం వాన ముంచెత్తింది. ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలు స్తంభించాయి. ఉపమాకలో ప్రధాన రోడ్లు, జానకయ్యపేట వెళ్లే మార్గం లో వర్షపు నీరు ఏరులా ప్రవహించడంతో స్థానిక ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగనన్న కాలనీ జలమయం అయ్యింది. నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి ఆవరణం వర్షపు నీటితో నిండుకుండలా దర్శనమిచ్చింది. చందనాడ, పెద తీనార్ల తదితర గ్రామాల్లో వర్షపు నీరు ప్రవహించడంతో లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నక్కపల్లి వీవర్స్ కాలనీ సమీపంలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది అమలాపురం - వేంపాడు వెళ్లే మార్గంలో ఏరులా వర్షపు నీరు ప్రవహించడంతో ,వర్షం కురుస్తున్నంత సేపు రాకపోకలు స్తంభించాయి. విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు.నక్కపల్లి వారపు సంత వర్షంతో బురదమయంగా దర్శనమిచ్చింది. వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

వీవర్స్ కాలనీ సమీపంలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఉపమాకలో జగనన్న కాలనీలో చేరిన వర్షపు నీరు

మాట్లాడుతున్న ఎంజిఎం సిఇఒ, డైరెక్టర్

సెవెన్ హిల్స్‌ను సొంతం చేసుకున్న ఎంజిఎం హెల్త్‌కేర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: విశాఖ నగరంలో పేరు పొందిన సెవెన్ హిల్స్ హాస్పిటల్‌ను చెన్నయ్‌కు చెందిన ఎంజిఎం హెల్త్ కేర్ సంస్థ కొనుగోలు చేసినట్లు ఎంజిఎం సిఇఒ ఎంకె బోస్, ఎంజిఎం హెల్త్‌కేర్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్, వింగ్ కమాండర్ ఎంకెబోస్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం నగరంలోని 4 పాయింట్స్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 'ఎంజిఎం హెల్త్‌కేర్ సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఇఒ బోస్ మాట్లాడుతూ ఇదే సంవత్సరంలో చెన్నయ్ అడయార్‌లోని ఎంజిఎం మలార్ హాస్పిటల్‌ను కొనుగోలు చేసిందని విశాఖలో మరో పెద్ద హాస్పిటల్ సెవెన్ హిల్స్‌ను కొనుగోలు చేయం ద్వారా దక్షిణ భారతదేశంలోని కీలక ప్రాంతాల్లో ప్రపంచ శ్రేణి ఆరోగ్య సేవలను అందించేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఈ ఆసుపత్రిని సొంతం చేసుకోవడంతో ఏపిలో మొట్టమొదటసారిగా ఎంజిఎం అడుగుపెట్టినట్లయిందన్నారు.అందుబాటు ధరల్లో వైద్యాన్ని అందించేందుకు ఎంజిఎం హెల్త్‌కేర్ సెవెన్ హిల్స్ హాస్పిటల్ సంస్థ దృష్టిసారిస్తుందన్నారు. ఎంజిఎం హెల్త్ కేర్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సాంకేతిక, చికిత్సలను విశాఖపట్నం పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు ఉత్తమంగా ఆరోగ్య సేవలను అందజేయనుందన్నారు. ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు విశాఖపట్నం సమాజానికి భవిష్యత్‌లో అందజేస్తామన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో శుక్రవారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా వ్యాసరచన, డిబేట్ నిర్వహించారు. 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాజు, ఐద్వా నాయకులు గౌరి, జన విజ్ఞాన వేదిక నాయకులు రెడ్డి, యుటిఎఫ్ యూనియన్ నాయకులు చిట్టి, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు రాజు, భూషణ్ , మోహన్ సాయి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురం ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి క్షుద్ర పూజలు కలకలం రేపాయి. సభా ప్రాంగణం భవనంలో ముగ్గులు వేసి పూజలు జరిపినట్లు ఉన్న ఆనవాళ్లను చూసి విద్యార్థులు భయాందోళన చెందారు. స్పందించిన పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు, ప్రజా కవి

కామ్రేడ్ జి.సన్యాసిరావు

సంస్మరణ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

విశాఖపట్నం | శనివారం 28-09-2024 | 8 పేజీలు

కలం, గళం యోధుడు సన్యాసిరావు

- ప్రజల్లో అనునిత్యం చైతన్యం నింపిన గొప్ప ఉద్యమకారుడు
- వేల పాటలు.. ప్రదర్శనలతో జనంలోకి దూసుకెళ్లిన వాగ్గేయకారుడు
- నేడు ఆయన సంస్మరణ సభ

ప్రజాశక్తి - గాజువాక

ఆయనకు పాటే ప్రాణం. రాతే ఊపిరి. కలం.. గళంతో ఎన్నో పోరాటాలకు ఆయన ఉత్తేజాన్నిచ్చారు. పాటే జెండా.. ప్రజాపాటే.. అజెండాగా బతికారు. కడవరకూ నిలిచారు. ప్రజల భాషలో పాట రాయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. కళ చైతన్యానికి గొప్ప సాధనం..జనచైతన్యానికి ఇంధనం అని నమ్మి తుదవరకూ కలం, గళం యోధునిగా నిలిచిన ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అంతటి గొప్ప సాహితీ శిఖరం గంగిరెడ్డి సన్యాసిరావు.

ప్రజా కవి, గాయకుడు, ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు గంగిరెడ్డి సన్యాసిరావు 1947లో మల్కాపురంలో జన్మించారు. విద్యాభ్యాస మంతా అక్కడే కొనసాగింది. డిప్లమో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో సాగింది. ఆ తరువాత బిహెచ్‌పివిలో ఉద్యోగం వచ్చింది. చిన్నప్పటి నుంచీ దృష్టిలోపం ఉన్నప్పటికీ ఆయన ప్రతిభకు అది అడ్డంకాలేదు. అంధత్వాన్ని జయించి పాట రాయడంలోనూ, పాడటంలోనూ గొప్ప ప్రావీణ్యం సంపాదించారు. విశాఖ కార్మిక వాడల్లో ఆయన పాటలు మార్మోగేవి. కార్మికులు ఎక్కువగా ఉండే గాజువాక, మల్కాపురం ఏరియాల్లో పాటలు పాడుతూ ఆయన ఉత్తేజం నింపేవారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూ మరో పక్క ప్రజానాట్య మండలి విస్తరణకు విశేష కృషి చేశారు. సుమారు 2 వేల పాటలు రాశారు. ప్రజా వాగ్గేయకారునిగా పేరుగాంచారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ సన్యాసిరావు పాటై ఉన్నారు. పాటల తూటాల ద్వారా ప్రశ్నిస్తూ వచ్చారు. ప్రజా పోరాటాలలో తన వంతుగా గొంతు కలుపుతూ వచ్చారు. ఆయన రచనలు, పాటల విషయానికి వస్తే సన్యాసిరావు మస్తిష్కమంతా పాటలమయం. ప్రజా పాటల భాండాగారం. మత్తు పదార్థాల ప్రమాదం నుంచి మానవ సంబంధాలు వరకు దేనినీ ఆయన కలం, గళం వదల్లేదు. సామ్రాజ్యవాదం, మతోన్మాదం, స్థానిక సమస్యలు, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ (మిగతా 2లో..)

రెడ్‌సెల్యూట్

కామ్రేడా... నీ కలం ఆగిపోదు.... నీ గళం మూగబోదు....
మేమున్నాం మేమున్నాం నీ వారసులం...
ప్రజా కళాకారులుగా ప్రజ్వరిల్లుతాం...
ప్రజల గుండెచప్పుడై పాట పాడుతాం... లాల్ సలాం కామ్రేడ్ లాల్ సలాం...

కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు గారు
ప్రజానాట్యమండలి కళాకారుడు

ప్రజానాట్యమండలి - విశాఖ జిల్లా కమిటీ

- **ఎం.చంటి** జిల్లా కార్యదర్శి, ప్రజానాట్య మండలి
- **జి.రమణ** జిల్లా అధ్యక్షులు, ప్రజానాట్య మండలి
- **అరుణ్‌జీ** జిల్లా ఉపాధ్యక్షులు ప్రజానాట్య మండలి
- **ఎస్.జి.ఎం.భాషా** పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ప్రజానాట్యమండలి
- **దండు నాగేశ్వరరావు** కార్యదర్శి, గురజాడ సాంస్కృతిక వేదిక
- **పి.వి.రమణ** అధ్యక్షులు, గురజాడ సాంస్కృతిక వేదిక
- **ఆర్.ఎస్.ఆర్.మూర్తి** కోశాధికారి, గురజాడ సాంస్కృతిక వేదిక
- **కె.సత్యనారాయణ** సహాయ కార్యదర్శి, ప్రజానాట్యమండలి
- **జి.స్టాలిన్** జిల్లా సహాయకార్యదర్శి ప్రజానాట్యమండలి
- **ఒ.విజయ** జిల్లా సహాయకార్యదర్శి, ప్రజానాట్యమండలి
- **జి.భారతి** జిల్లా ఉపాధ్యక్షులు , ప్రజానాట్యమండలి
- **ఎమ్.నీలకంఠం** జిల్లా ఉపాధ్యక్షులు, ప్రజానాట్యమండలి
- **వై.అప్పారావు** జిల్లా కమిటీ మెంబర్, ప్రజానాట్యమండలి
- **ఆర్.కృష్ణార్జున** ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ మెంబర్
- **ఎం.గౌరీశంకర్** ప్రజానాట్యమండలి, జిల్లా కమిటీ మెంబర్
- **ఎమ్.నాగేశ్వరరావు** ప్రజానాట్యమండలి, జిల్లా కమిటీ మెంబర్
- **తెలుగు రమణ** ప్రజానాట్యమండలి, సీనియర్ నాయకులు
- **ఎం.నాగేశ్వరరావు** ప్రజానాట్యమండలి, సీనియర్ నాయకులు
- **ఎం.లీలావతి** ప్రజానాట్యమండలి, సీనియర్ గాయకులు
- **బి.పాపారావు** ప్రజానాట్యమండలి, సీనియర్ నాయకులు
- **ఎం.ఎల్లాజీ** కార్యదర్శి షార్ట్‌పిల్మ్ అసోసియేషన్
- **ఎం.డి.అస్రఫ్** అధ్యక్షులు షార్ట్‌ఫిల్మ్‌మేకర్స్ అసోసియేషన్
- **షేక్ హుస్సేన్** పెన్షనర్స్ అసోసియేషన్, సీనియర్ నాయకులు
- **అనపర్తి అప్పారావు** ఆంధ్రాయూనివర్సిటీ సిటీ సీనియర్ నాయకులు
- **ఎం.జగ్గరాజు** హైదరాబాద్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ
- **కె.దేవేంద్ర** సీనియర్ రచయిత ప్రజానాట్యమండలి, ఖమ్మం
- **ఎం.సుందరయ్య** సినీ,టి.వి. కళాకారులు, ప్రజానాట్యమండలి, సీనియర్ నాయకులు
- **పిల్లా సన్యాసిరావు** దర్శకులు, రచయిత, నటులు
- **వెంకటేష్** కొరియోగ్రాఫర్ ప్రజానాట్యమండలి
- **విశ్వశాంతి దేవరపల్లి** ప్రజానాట్యమండలి
- **చొప్ప వెంకట అప్పారావు** జానపద కళాకారులు, చోడవరం
- **పద్మ రాగిణి** శ్రీ సాయికళానికేతన్ రాగిణి కూచిపూడి నాట్యమండలి
- **దమ్ములూరి సత్యనారాయణ** (డెంకల్) ప్రజానాట్యమండలి, స్టీల్‌ప్లాంట్
- **శరగడం రామకృష్ణ** ప్రజానాట్యమండలి, సీనియర్ నాయకులు
- **బుగత అప్పారావు** షిప్‌యార్డు (రిటైర్డ్), విశాఖపట్నం.

కామ్రేడ్ జి.సన్యాసిరావు జ్ఞాపకాల దృశ్యమాలిక

వినోదవల్లరిలో మాట్లాడుతున్న సన్యాసిరావు

అక్షర కళాయాత్ర బృందంలో సభ్యునిగా సన్యాసిరావు

కన్నడ కావేరి సభలో కంజరితో మోగిస్తూ పాటలతో అలరిస్తున్న సన్యాసిరావు

ప్రజానాట్య మండలి ప్రదర్శనలో సన్యాసిరావు

డప్పుల దళంతో సన్యాసిరావు

సినీనటుడు, రచయిత ఎల్‌బి.శ్రీరాంతో సన్యాసిరావు

సిపిఎం ముఖ్య నేతలతో సన్యాసిరావు

కలం, గళం యోధుడు సన్యాసిరావు

శ్రద్ధాంజలి

మీ కలం, గళంతో
కార్మికులను చైతన్యపరిచే
పాటలు రాసి, పాడి నిరంతరం
ఉత్తేజపరిచే
పోరాటలకు ఊపునిచ్చిన
మీ ఆశయ సాధనకు
కృషి చేస్తాం.
మీ ఆశయసాధనకై
ముందుకు సాగుతాం...
మీకు ఇవియే
మా ఉద్యమ జోహార్లు...

కామ్రేడ్ జి. సన్యాసిరావు గారు
ప్రజానాట్యమండలి కళాకారుడు

HPCL CONTRACT WORKERS UNION
(Regd No. 1555/96)
Affilated CITU, Visakhapatnam.

(మొదటి పేజీ తరువాయి..)

ఇలా.. అన్నింటినీ ఆయన ప్రశ్నించారు. నూతన పారిశ్రామిక విధానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, హరిజన గిరిజన సమస్యలు, నిరక్షరాస్యత.. ఇలా అన్నింటిపైనా ఆయన కలం దునుమాడింది. దురాచారాలు, మూఢ నమ్మకాలు.. అన్ని సామాజిక రుగ్మతలపై విరుచుకుపడింది. సన్యాసిరావు కలం ఉత్తరాంధ్ర మాండలికం.. జానపదరాగాల సోయగం. ప్రజల భాష, అందమైన సాహిత్యం సన్యాసిరావు సొంతం. అయన ప్రజాపాటల వైభవాన్ని రాయాలంటే పేజీలు చాలవు. అక్షరాస్యతపై పాట రాస్తూ.. 'చదువు లేనోడి బుఱ్ఱ వట్టి చవిటి పఱ్ఱ' అన్నాడు సన్యాసిరావు. నిరుద్యోగ సమస్యలపై ఎన్నో పాటలు రాశాడు. ఆకాశానికి అంటే ధరలపై 'ఏం.. బజారు.. మాయబజారు' అంటూ కలం కదిపాడు. సోవియట్ పతనంతో నిస్తేజంగా ఉన్న కమ్యూనిస్టు శ్రేణులను ఉత్తేజపరిచేందుకు 'అజేయం.. అజేయం.. ఎన్నిటికీ అజేయం.. మార్క్స్, లెనిన్ ఆశయాల పునదియై సోషలిజం అజేయం' అంటూ ఓ గొప్ప పాట రాశాడు. కుల, మత జాఢ్యంపై కలం కత్తి దూశాడు. 'గాలిది ఏ కులము.. ఈ నేలది ఏ మతము' అని ప్రశ్నించాడు. అనంత సాహితీ ప్రస్థానం ఆయనది.

సామాజిక సేవలో భాగంగా సన్యాసిరావు 40 సార్లు రక్తదానం చేశారు. మంచి జ్ఞాపక శక్తి కలిగిన ఆయన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖమ్మం, నల్గొండలకు వెళ్లి అక్కడి అభ్యుదయ భావాలు కలిగిన వారిని గెలిపించాలని తన పాటలతో చైతన్యం నింపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఖరగ్‌పూర్ వంటి ప్రాంతాల్లో నెల రోజులపాటు ఉండి అక్కడి ప్రజలను ఆలోచింపజేశారు. చివరి నిమిషం వరకూ ఆయన ఎర్రజెండాను వీడలేదు. పాటే ప్రాణంగా బతికారు. 2024 సెప్టెంబర్ 14న గాజువాక సమీపంలోని పాత కర్ణవానిపాలెంలో ఆయన కన్నుమూశారు.



సన్యాసిరావును సత్కరిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

కుటుంబం

సన్యాసిరావు తండ్రి నూకరాజు. ఆయన ఎన్‌ఎడిలో ఉద్యోగం చేసేవారు. కార్మిక సమస్యలపై పోరాడేవారు. సన్యాసిరావుకు ఆ వారసత్వం వచ్చింది.

సన్యాసిరావు భార్య పేరు నాగేంద్ర రాజ్యలక్ష్మి, కుమారులు స్టాలిన్, సుందరయ్య, కుమార్తె చైతన్య, అల్లుడు కృష్ణ. వీరంతా సన్యాసిరావు మృతి తరువాత ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కెజిహెచ్ అనాటమీ విభాగానికి అప్పగించారు. సన్యాసిరావు బాటలో నడిచి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

శ్రామిక వర్గ కళాకారుడు

- ఎంవిఎస్.శర్మ
ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

శ్రామిక వర్గ కళాకారుడు కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు. నిజమైన కళాకారుడికి ఆయన నిలువెత్తు నిదర్శనం. అటువంటి కళాకారులు కళారూపాల ద్వారా ఎల్లకాలమూ ప్రజల హృదయాల్లో సజీవంగానే ఉంటారు. శ్రామికవాడలో పుట్టి, యంత్ర భూతముల కోరలు తోమే కార్మికుల మధ్య పెరిగి, ఆ పోరాటాల్లో నుంచే చైతన్యాన్ని సంతరించుకుని, ఆ కార్మికులు, కష్టజీవుల కోసం తన జీవితాంతమూ పాటలు కట్టి, ఆ పాటలను పాడి తన జీవితాన్ని సార్థకం చేసుకున్న కళాకారుడు సన్యాసిరావు. కొంతసేపు సన్యాసిరావుతో ముచ్చటిస్తే చాలు ఎన్నో కొత్త పాటల ఊహలను, బాణీలను రూపొందించగల అరుదైన సామర్థ్యం అతడి సొంతం. నాకు తెలిసి.. సన్యాసిరావు పాటలు లేకుండా విశాఖపట్నంలో నడిచిన శ్రామిక వర్గ పోరాటాలు ఏవీ లేవు. అన్ని ఫ్యాక్టరీల గేటు మీటింగుల దగ్గరా సన్యాసిరావు పాట వినపడేది. ఆ తర్వాత ఆ కార్మికుల నోళ్లలో ప్రతిధ్వనించేది. కంటిచూపు దెబ్బతిని కలిగించిన పరిమితులేవీ అతడి సృజనను అడ్డుకోలేకపోయాయి. అతడి ఉద్యమస్ఫూర్తి అంత గొప్పది.

ప్రజల భాషలో పాటలు రాయగల నిపుణుడు

2013లో గిరిజన ప్రాంతంలో పార్టీ పాదయాత్రను సంకల్పించింది. అక్కడి గిరిజనులు పాడుకోగలిగేలా వారి భాషలో పాటలు రాయగలరా? అని సన్యాసిరావును నేను అడిగాను. దానినొక సవాలుగా తీసుకుని ఒక వారం రోజుల పాటు పాడేరు, అరుకు ప్రాంతాల్లో గిరిజన కార్యకర్తలతో సమయం గడిపి ఏకంగా ఒక పాటల క్యాసెట్‌నే రూపొందించి నా చేతిలో పెట్టాడు సన్యాసిరావు. ఇరవై ఏళ్ల తర్వాత కూడా ఆ పాటలను నేటికీ అక్కడ మన గిరిజనులు, కార్మికులు పాడుకుంటున్నారు. నిజమైన ప్రజా కళాకారుడికి నిర్వచనం సన్యాసిరావు. అటువంటి కళాకారులు తమ కళారూపాల ద్వారా ఎల్లకాలమూ ప్రజల్లో సజీవంగానే ఉంటారు. సన్యాసిరావు అమర్ రహే!.

ప్రజల పాటల రచయిత, గాయకుడు సన్యాసిరావు



- సిహెచ్.నర్సింగరావు
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కష్ట జీవుల పాటల రచయిత, గాయకుడు కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 40ఏళ్లుగా అనేక ప్రజా, కార్మిక ఉద్యమాల్లో అలుపెరగని కళాకారుడు ఆయన. కష్ట జీవుల కోసం ఎన్నో పాటలను కూర్చి, జీవితమంతా ఆ గేయాల రచనలతో విశాఖ ఉమ్మడి జిల్లాలో పాపులర్ అయిన ప్రజా కళాకారుడు సన్యాసిరావు. ఏ కార్యక్రమానికైనా, ప్రజా ఉద్యమానికైనా ఆయన పాట కచ్చితంగా ఉండేది. కమ్యూనిస్టు ఉద్యమానికి అటు నక్సలైట్లు, ఇటు రివిజనిస్టులతో పెద్ద దెబ్బ తగిలిన నేపథ్యంలో మల్కాపురం ఏరియాలో మిగిలిన ఏకైక కుటుంబం పోతిన కోటేశ్వరరావుది. ఆ కుటుంబం అప్పట్లో పార్టీకి, ప్రజా ఉద్యమాలకు అండగా ఉండేది. ఆ కుటుంబం నుంచి సన్యాసిరావు వచ్చారు. చిన్నప్పటి నుంచే కంటి చూపు సరిగ్గా లేకపోయినా చూపున్న వారికంటే ప్రతిభావంతంగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడం, పాటలు రచించి ఆయనే బాణీలు కట్టి ప్రజారంజకంగా ఆలపించడంలో సహజసిద్ధ పాటగాడుగా పేరు తెచ్చుకున్నారు.

ప్రజా ఉద్యమాలు, పోరాటాలకే కాకుండా పండగలు, సరదా వేళల్లోనూ తన బాణీలో మంచి రచనలు చేస్తూ పాటలు పాడి అందరినీ అలరించేవారు. పార్టీ, కార్మిక ఉద్యమాల సందర్భంగా ఆయన అందరికంటే ముందుగానే 'కంజీరా'తో హాజరై వచ్చిన ప్రజలను అలరించే గేయాలను ఆలపించేవారు. ఆయన బిహెచ్‌పివిలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఎన్‌పిఆర్ సహకారంతో సన్యాసిరావు పర్మినెంట్ ఉద్యోగిగా కార్మిక సంఘాల్లో చురుకుగా వ్యవహరించేవారు. అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో కార్మికోద్యమంలోనూ సన్యాసిరావు రాసి, పాడిన పాటలు పాపులర్‌గా నిలుస్తున్నాయి. కార్మికుల చైతన్యం కోసం యాత్ర పెట్టాం. ఆ 15 రోజులూ సన్యాసిరావు స్వయంగా ఉన్నారు. గ్రామ, గ్రామంలోనూ ఆయన పాటలు గురించి కార్మికులు చర్చించుకుంటారు. గ్రామాల్లో పేద రైతుల సమస్యలపైనా స్పందిస్తూ పాటలు రచించారు. ప్రజల నాడిని పసిగట్టి ప్రజల పాటలు పాడేవారు. నిత్యం ప్రజల కోసం పరితపించే కళాకారుడు సన్యాసిరావు.

నిబద్ధత గల కార్యదక్షుడు కామ్రేడ్ సన్యాసిరావు

- ఎం. జగ్గునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి

నీ లక్ష్యాన్ని సాధించాలన్న తపన ఉండి నిబద్ధతో కృషి చేయాలన్న సంకల్పం నీకుంటే... ఉద్యోగం, ఆర్థిక సమస్యలు, అనారోగ్యం, అంగవైకల్యం, వృద్ధాప్యం నిన్ను ఏమీ చేయలేవని కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు నిరూపించారు. మనకు, భవిష్యత్తు తరాలకు ఆయన ఆదర్శంగా నిలిచారు.

మల్కాపురం జోన్ పరిధిలోని ఆంధ్రా స్టీల్ కార్పొరేషన్‌లో 1985లో కామ్రేడ్ సిహెచ్. నర్సింగరావు నేతృత్వంలో సిఐటియు యూనియన్ ఏర్పడింది. సంస్థలో ఫేబ్రికేషన్ డిపార్టుమెంట్ నుండి కమిటీ సభ్యునిగా నన్ను ఎన్నుకున్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రా స్టీల్ కాలనీలో కార్మికులకు పాటలు, ఆటలు, వ్యాసరచన, వివిధ పోటీలు యూనియన్ నిర్వహించింది. పాటల పోటీలకు కామ్రేడ్ సన్యాసిరావు న్యాయ నిర్ణేత. పోటీలో పాల్గొన్న నేను అల్లూరి సీతారామరాజు చిత్రంలోని 'తెలుగువీర లేవరా దీక్ష బూని సాగరా, దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా' అనే పాట పాడగా ద్వితీయ బహుమతికి ఎంపికయ్యాను. నాటి నుండి సన్యాసిరావు నన్ను వదలలేదు. పిఎన్ఎంలో చేర్చుకొని అనేక పాటలు నేర్పించారు. మిర్యాలగూడ సిఐటియు రాష్ట్రస్థాయి క్లాసులు, నాగార్జునసాగర్ రాష్ట్రస్థాయి డివైఎఫ్ఐ క్లాసుల్లో నిర్వహించిన పాటల పోటీల్లో ఆయన రాసిన పాటలు నేను పాడగా విశాఖ జిల్లాకు ప్రథమ, ద్వితీయ బహుమతులు వచ్చాయి. 1985 నుండి కామ్రేడ్ సన్యాసిరావు మరణించే వరకు దాదాపు 40 సంవత్సరాలు ఆయనతోనూ, ఆయన కుటుంబంతోనూ బాంధవ్యం వుంది.

కామ్రేడ్ సన్యాసిరావు రచించి బాణీ సమకూర్చిన పాటలు.. పాడిన కళాకారులకే కాక సాధారణ ప్రజానీకానికి హత్తుకొనేలా, ఆలోచింప చేసేవిగా, కార్యోన్ముఖులను చేసేవిగా ఉండేవి. మంచినీటి సమస్యపై ఆయన రాసిన "ఏందిరో ఓరేందిరో నువ్వెళ్లకిళ్ల పడతవేంది రన్నా కూలోడా, నీకళ్ళు ఎర్ర చెయ్యవేందిరన్నా కూలోడా, మంచినీళ్ల పంపుకాడ మాపులంత మకాలు" పాట, కార్మిక కుటుంబాల జీతాలు, అప్పులపై రాసిన "పండగ పది రోజులుంది పప్పులొండు పెళ్లమా గోడలకు సున్నమేసి గారెలొండు పెళ్ళమా పప్పులోకి ఉప్పు లేదు పప్పులేంటి మామయ్యా.. గెంజితాగె దిక్కులేదు గంతు లేటి మామయ్యా" పాట, అధిక ధరలపై రాసిన "ఏం బజారు ఏం బజారు మాయబజారు కూలన్న మాయబజారు.." వంటి పాటలు సన్యాసిరావు గళం నుండి రాలిన జన గానాలు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో సన్యాసిరావు పాటలేని కార్మిక, కర్షక ప్రజా ఆందోళనలు లేవంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వ, ప్రైవేటు అసంఘటిత రంగ కార్మిక పోరాటాలన్నింటిలోనూ ఆయన పాత్ర ఉంది. ప్రజా పోరాటాల్లోనూ ఆయన గళం వినిపించేది. సన్యాసిరావు రెండు కళ్ళు చూపు పోయినా, ఆయన సంకల్పం ముందు అంగవైకల్యం పటాపంచలైంది. పుస్తకాలు, పత్రికలు చదివించుకునేవారు. వార్తలు వినేవారు. సమస్యలు చెబితే వెనువెంటనే పాటను తయారు చేయించి బాణీ కట్టించి, కళాకారులను కూర్చోబెట్టి శిక్షణ ఇచ్చి సిద్ధం చేసేవారు. రాత్రి, పగలు, ఎండ వానలు లెక్కలేదు. ఏ ప్రాంతానికి కావాలంటే ఆ ప్రాంతానికి ఎవరో ఒకర్ని తోడు తీసుకుని పోయేవారు. తన బాధ్యత పూర్తిచేసి వచ్చేవారు. తను కవిగా, రచయితగా, కళాకారునిగా కృషి చేయడంతో పాటు ఉద్యమానికి అనేక మంది కళాకారులను తయారు చేసి అందించారు.

కామ్రేడ్ సన్యాసిరావు ఈ విధంగా కృషి చేయడానికి సమసమాజం సాధించాలన్న లక్ష్యసాధన ఎడల ఆయనకున్న నిబద్ధత ఒక ఎత్తయితే.. ఆయన సహధర్మచారిణి నాగేంద్ర రాజ్యలక్ష్మి సహకారం, సహనం మరోఎత్తు. కుటుంబం, పిల్లల బాధ్యతలు పూర్తిగా లక్ష్మి చూసేవారు. ఆయనను కుమారునిలా సాకి, తయారు చేసి కార్యక్రమాలకు పంపేవారు. ఒక్కోసారి సన్యాసిరావు కార్యక్రమాలకు తీసుకువెళ్లడానికి సహాయకులుండేవారు కాదు. ఆ సమయంలో లక్ష్మి ఈయనను బస్సు ఎక్కించేవారు. తిరిగి ఏ రాత్రికి వచ్చినా ఆయన కోసం బస్‌స్టాండ్‌లో వేచివుండి ఇంటికి తీసుకువచ్చేవారు.

సన్యాసిరావు తనేకాక తన కుటుంబ సభ్యులను ప్రజాసేవలో భాగస్వాములను చేశారు. పెద్ద కుమారుడు స్టాలిన్‌కు సంతోషితో ఆదర్శ వివాహం చేశారు. కుమారుడు కళారంగం, కోడలు న్యాయవాదుల రంగం బాధ్యతల్లో ఉన్నారు. నేను చనిపోతే మీరు నన్నెవరూ తీసుకువెళ్ళనవసరం లేదు. నా పార్టీ వాళ్లే వచ్చి మోసుకుపోతారనేవారు. పార్టీ ఎడల ఆయనకున్న నమ్మకం అలాంటిది. తను మరణించాక నా భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం దేహదానం చేయాలని, పార్టీ పద్ధతుల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని బతికుండగానే కుటుంబ సభ్యులకు చెప్పారు. దీనిని కుటుంబ సభ్యులు పాటించి మాటనిలబెట్టారు. తను జీవించి ఉన్నప్పుడే కాక మరణించాక కూడా ప్రజల హృదయాల్లో జీవిస్తున్న ధన్యజీవి కామ్రేడ్ సన్యాసిరావు. ఆయన ఆశయాలను సాధిద్దాం. కష్టాలను ఎదిరించి, అధిగమించి మన లక్ష్య సాధనకు పునరంకితమవుదాం. అదే కామ్రేడ్ సన్యాసిరావుకు మన మందించే ఘన నివాళి. సన్యాసిరావు మృతికి పార్టీ జిల్లా కమిటీ తరపున మరోమారు శ్రద్ధాంజలి ఘటిస్తూ, కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

అమర రహే కామ్రేడ్ సన్యాసిరావు
సాధిస్తాం నీ ఆశయాలను..

కుటుంబ సభ్యులతో సన్యాసిరావు

తుదిశ్వాస వరకు ప్రజల కోసమే...

- నాన్న ఆశయసాధనలో భాగమౌతా..

ప్రజాశక్తి గాజువాక : ప్రజలే తన ఊపిరిగా భావించి, తుదిశ్వాస వరకు వారికోసమే నాన్నగారు పనిచేశారు. ప్రజా, కార్మిక సమస్యలు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి, వారి బాధలను తన పాటల రూపంలో రాసి ఆలపించేవారు. ఉద్యోగం చేస్తూనే, ప్రజా ఉద్యమంలో భాగస్వాములయ్యేవారు. ప్రజలు, కార్మిక సమస్యలపై అనేకానేక పాటలు రాసి, పాడేవారు.ఎక్కువ సమయం కార్మికుల కోసమే పనిచేసేవారు. ఆయనకు ఎల్లప్పుడూ నా సహకారం ఉండేది. నాన్నగారి ఆశయాలు, భావాలు నచ్చి, నేను కూడా పార్టీలో కొనసాగుతున్నాను. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, నెరవేర్చేందుకు కృషి చేస్తాను.

– గంగిరెడ్డి స్టాలిన్, సన్యాసిరావు కుమారుడు.

నిరంతరం కార్మికుల తపనే!

ఆయన ప్రజా ఉద్యమంలో పాటలు పాడుతుంటే, నేను ఇంటి పనులు చూసుకునే దానిని. ఆయనకు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉండేదానిని. ఆయన ఉద్యోగం చేస్తూనే కుటుంబ బాధ్యతలు చూసుకునేవారు. ఇంకోవైపు ప్రజాఉద్యమాల్లో పాల్గొనేవారు. ఎల్లప్పుడూ కార్మికుల కోసమే పరితపించేవారు. తన ఆటాపాటల ద్వారా కార్మికులు, ప్రజలకు మేలు జరగాలని పనిచేసేవారు.

– జి.నాగేంద్ర రాజ్యలక్ష్మి, సన్యాసిరావు భార్య

ప్రజా కళా శిఖరం..సన్యాసిరావు

ప్రజా నాట్యమండలి ప్రాణ వాయువుల్లో ఒకటి జి.సన్యాసిరావు గారి కలం..గళం. విశాఖ.. మల్కాపురం..అతని సాంస్కృతిక కేంద్రం. నేత్రాలను అంధత్వం ఆవరించినా, గాత్రంతో ఆశు కవిత్తంతో ..ప్రాణం పోసిన గానంతో పండిత కవి, గాయకులకు అందనంత ప్రజా కళా శిఖరంగా ఎదిగిన ప్రజా వాగ్గేయకారుడు. ఏకసంధానుగ్రహి.. నమ్మిన సిపిఎం పట్ల ఇసుమంతైనా సడలని నిబద్ధత. ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పార్థివ దేహం ఢిల్లీ ఆఫీసులో ఉండగానే, ఉదయం 10 గంటలకు సన్యాసిరావు గారి మరణ వార్త ఆశనిపాతమైంది. ఆయన కూడా ఏచూరి మాదిరిగానే, అంతకుముందు సిపిఎం అగ్ర నాయకుల మాదిరిగానే తన పార్థివ దేహాన్ని కెజిహెచ్‌కు అప్పగించాలని జీవించినప్పుడే నిర్ణయించడం గొప్ప విషయం. షిపియార్డు జూనియర్ కాలేజీ విద్యార్థిగా, డివైఎఫ్ఐ శ్రీహరిపురం శాఖ సభ్యునిగా ఉన్న నాటి నుంచి కామ్రేడ్ సన్యాసిరావు పరిచితులు. కొన్ని పాటలు రాసినప్పుడు, కలిసి పని చేసిన రోజులున్నాయి. ఓయ్ ..నల్లి ధర్మారావు అని ఆత్మీయంగా పిలిచేవారు. క్రమ క్రమంగా అంధత్వం అతని నేత్రాలను ఆవరించినా, ఏమాత్రం అదో అడ్డంకిగా భావించకుండా, విన్న సమాచారంతోనే మనసులో పాటను రచించడం, బాణీకట్టి పాడటం ఒక్క సన్యాసిరావు గారికే చెల్లింది. విశాఖ ప్రజా నాట్యమండలికి ఆయన వెన్నెముక. ఆయనకు నా జోహార్లు.

- నల్లి ధర్మారావు, రచయిత, సీనియర్ జర్నలిస్టు

శ్రద్ధాంజలి

ఆయన పాట.. ప్రజా పాట..
జనం పాట.. జన చైతన్యపు బాట..
వాస్తవాల తూటా..
ప్రజా చైతన్య బావుటా..
ఆయన భౌతికంగా లేకున్నా..
ఆ పాట అజరామరం.
కామ్రేడ్ గంగిరెడ్డి సన్యాసిరావు గారికి
అరుణాంజలి ఘటిస్తూ...

కామ్రేడ్ జి. సన్యాసిరావు గారు
ప్రజానాట్యమండలి కళాకారుడు

SHIPYARD CONTRACT LABOUR UNION
(Regd No. D-973/88,
Affilated CITU, Visakhapatnam-530011

కామ్రేడ్ సన్యాసిరావు చిరస్మరణీయుడు

- కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

కామ్రేడ్ జి.సన్యాసిరావు ప్రజా కవి, కళాకారుడుగా ప్రజా ఉద్యమాలకు సేవలందించారు. ఆయన పాటలు ఒక సామాజిక, రాజకీయ దృక్పథాన్ని చూపించేవి. ఆయన సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమినంచి పాటలు రాసే వ్యక్తి కాదు. ఎక్కడో జరిగిన పోరాటాలకు, మరెక్కడో జరిగిన ఉద్యమాలకు, ఇంకెక్కడో జరిగిన నిరసనలకు స్పందించే ప్రజాకవి. ఆయన పాట లేని సభలు, సమావేశాలు వుండేవి కావు. సందర్భాన్ని బట్టి పాటలు రాసేవారు. సిద్ధాంతం పట్ల స్పష్టత కలిగినవాడు. ప్రభుత్వ రంగంలో పని చేయటమేకాదు, ఆ రంగంపై ప్రభుత్వాల దాడికి పూనుకున్నప్పుడు తనదైన శైలిలో ప్రజలను చైతన్యవంతుల్ని చేసేవారు. నాయకులు గొంతుకుల్ని బట్టి ఆయన పేరు చెప్పేవారు. ఆయన అంధత్వాన్ని అధిగమించి అందరి మన్ననలు పొందిన కవి. సమాజానికి ఏదో చేయాలనే తపన నిరంతరం కనిపించేది.

కామ్రేడ్ సన్యాసిరావు బిహెచ్‌పివిలో ఉద్యోగిగా, కవి, కళాకారుడుగా నాకు పరిచయం. నేను విద్యార్థి ఉద్యమంలో ఉన్నప్పటి నుండి ఉద్యమానికి కావాల్సిన పాటలు రాసి, బాణికట్టేవారు. ప్రజల బాధలు తెలిసినవాడు. ప్రభుత్వ విధానాలు ప్రజల మీద ఎలాంటి ప్రభావం కల్పించేవో తన పాటల రూపంలో ప్రజల్ని చైతన్యం చేసి, వారిని ఉద్యమాల్లోకి రావాటానికి దోహదం చేశారు. ఆయన కుటుంబ సభ్యులు ప్రజా ఉద్యమాల్లో పాల్గొనేవారు. పెద్ద అబ్బాయి స్టాలిన్ విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. ఇప్పుడు ప్రజానాట్య మండలి కాళాకారునిగా వున్నారు. కులాంతర వివాహాలను ఆయన పోత్సహించేవారు. ఆయన కుమారుడు స్టాలిన్‌కు కులాంతర వివాహం చేశారు. సన్యాసిరావు జీవించి వున్నంత కాలం ప్రజా ఉద్యమాలకు అంకితమయ్యారు. ఆయన చనిపోయిన తరువాత కూడా తన పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థుల ప్రయోగాలకు ఇచ్చారు. కామ్రేడ్ సన్యాసిరావు తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివర వరకు అమలు చేసిన చిరస్మరణీయుడు.

ప్రజా ఉద్యమ పాటల ప్రవాహం సన్యాసిరావు

- పి.మంగరాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు

సన్యాసిరావు ఓ పాటల ప్రవాహం. కంటి చూపు లేకపోయినా సమాజాన్ని చదివిన మార్క్సిస్టు అధ్యయనశీలి, రచయిత. వాగ్గేయకారుడు. ప్రగతిశీల సాహిత్యానికి ప్రాణవాయువు లాంటి వ్యక్తి. ప్రజానాట్యమండలికి సుదీర్ఘకాలం ఆయన కలాన్ని, గళాన్ని అంకితమిచ్చిన అక్షర యోధుడు. ఆయన కలం నుంచి జాలువారిన అనేక ప్రజా ఉద్యమ, అభ్యుదయ గీతాలు ప్రజా కళాకారుల గొంతులో వినబడుతూనే ఉంటాయి. ఆయన పాటలేని ప్రజానాట్యమండలి కార్యక్రమం లేదు అనడం అతిశయోక్తి కాదు. ఆయన సాహిత్యంతో ప్రజా సాంస్కృతిక రంగంలో చెరిగిపోని ముద్ర వేశారు. అత్యంత సాధారణ కుటుంబంలో పుట్టి అణువణువునా కార్మిక వర్గ దృక్పథం అలవరుచుకుని కార్మికవర్గ పక్షపాతిగా తన జీవితాన్ని కొనసాగించారు. ప్రజానాట్యమండలి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అనేక కళాజాతాల్లో, సాంస్కృతిక ఉద్యమాల్లో నిరంతరం ఆయన పాటల ద్వారా భాగస్వామి అయ్యారు. 'పాట నేనవుతా కోయిల పాట నేనవుతా – నీతి పరుల త్యాగధనుల బాట నేనవుతా – ప్రజానాట్యమండలినై పల్లవించుతా' అంటూ ఆయన రాసిన గీతంతో ప్రజానాట్యమండలి సాంస్కృతిక ఉద్యమ సారథిగా తెలుగు నేలపై ఏ విధంగా ముద్ర వేసిందో తెలుస్తుంది. 'ప్రజాతంత్ర వాదులారా – ప్రజాస్వామ్య జ్యోతులారా ఆదరించండి ప్రజానాట్యమండలి' అంటూ ప్రజానాట్యమండలి సామాజిక అవసరాన్ని చాటిచెప్పారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై 'కవుల గొంతులను నులిమేస్తే కవనమాగిపోతుందా కలం పైన మసి పూసేస్తే గళం పాడకుంటుందా' అంటూ సఫ్దర్ హాష్మీ హత్యోదంతాన్ని, నరేంద్ర దబోల్కర్, కల్బుర్గి, పన్సారే, గౌరీ లంకేష్ వంటి వారిపై జరిగిన దాడులను నిరసించారు.

'ఏం బజారు ఇది ఏం బజారు – మాయాబజారు కూలన్న మాయ బజారు' అంటూ ఆకాశాన్నంటుతున్న అధిక ధరలపై సామాన్యుని ఆవేదనను ఆవిష్కరించారు. సాంఘిక సంక్షేమ కళాజాతాల్లో 'గాలిది ఏ కులము ఈ నేలది ఏ కులము' అనే పాట అభ్యుదయ కాముకులను, సామాజిక ఉద్యమకారులను నిత్యం ప్రభావితం చేస్తూనే ఉంది. కులోన్మాదులను, ఛాందస, సనాతనవాదులను నిత్యం ప్రశ్నిస్తూనే ఉంది. కుల వివక్షపైన ఆయన రాసిన పాటలు తూటాల్లా పేలాయి. సబ్ ప్లాన్ చట్టం అమలు కోసం 2013లో ప్రజానాట్యమండలి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సబ్‌ప్లాన్ కళా యాత్రలో ఆయన ఆదివాసుల జీవితాన్ని ఆవిష్కరిస్తూ 'కొండ కొండకు గండు తుమ్మెద జుం నాదాలు చేయాలి' అనే పాట, 'అడవి తల్లి బిడ్డలుగా బతుకుతున్నోళ్ళం – కొండల్లో కోనల్లో కాపురమున్నోళ్ళం' అనే పాట గిరిజన ప్రాంతాల్లో సబ్ ప్లాన్ చట్ట ప్రాధాన్యతను, ఆవశ్యకతను ఆవిష్కరించిన తీరును గమనిస్తే 77 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆదివాసుల జీవితాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. నేటి ప్రభుత్వాలు ఆదివాసుల సంక్షేమాన్ని ఏ విధంగా గాలికి వదిలేసాయో, ఆదివాసీ ప్రాంతాలు ఏ విధంగా అభివద్ధికి నోచుకోక ఎందుకు వెనుకబడ్డాయో కళ్లకు కట్టినట్లు అర్థమవుతుంది. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరిగిన తరుణంలో కూడా ఆయన కలం నుంచి ఆదివాసీ హక్కుల కోసం అనేక గీతాలు ఆవిర్భవించాయి, విస్తృత ప్రజాదరణ పొందాయి.

బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, మోడీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వైఖరిని నిరసిస్తూ 'మోడీ దొంగల బండి యమ జోరు మీద ఉందంటూ' ఆయన రాసిన పాట ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని కార్యోన్ముఖులను చేస్తుంది. కార్మిక ఉద్యమాలకు నిలయమైన విశాఖపట్నంలో జరిగే ప్రతి కార్మిక ఉద్యమానికీ ఆయన పాట ఒక ఆయుధంలా ఉపయోగపడేది. 'సిఐటియు సంఘం మనలను పిలిచింది కార్మిక వర్గపు ఐక్యతను అది కోరింది' అంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆయన పాట ఓ ప్రభంజనం అయింది. ప్రతి సిఐటియు వేదికపై ఈ పాట నేటికీ వినిపిస్తూనే ఉంది. భవన నిర్మాణ కార్మికుల కోసం 'ఎంత చక్కగుందిరో రంగుల మేడ దాన్ని కట్టినోడికేనాడు లేదురా నీడ' అంటూ, రైల్వే కార్మికుల కోసం, రైల్వే లోకో పైలట్ల కోసం, తోపుడుబండ్ల కార్మికుల కోసం, అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఆయన రాసిన ప్రతి పాట ఓ ఆణిముత్యమే. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి సంఘీభావంగా అనేక గీతాల్ని ఆయన రచించారు. 2015లో విశాఖలో సిపిఎం జాతీయ మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా 'సిపిఎం విధానాలు నికరం శిరమెత్తిన ఉద్యమాల శిఖరం' అంటూ ఆయన రాసిన గీతంతో ప్రజానాట్యమండలి నిర్వహించిన జనం కోసం కళాయాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తతంగా మహాసభల ప్రచారాన్ని నిర్వహించాం. 2019 సిపిఎం జాతీయ మహాసభల కోసం 'వామపక్ష ప్రజాతంత్ర మార్గం దేశానికదే ప్రత్యామ్నాయం' అంటూ ఆయన రాసిన పాట దేశ భవిష్యత్తుకు కమ్యూనిస్టుల అవసరాన్ని తెలియజేస్తుంది.

వ్యక్తిగతంగా సన్యాసిరావుతో నాకు పరిచయం తక్కువే అయినా ఆయన పాటలతోనే నా పయనం ఎక్కువగా సాగింది మా ప్రయాణం. 2020లో ఎన్ఆర్‌సి అంశంపై ప్రజానాట్యమండలి చిలకలూరిపేటలో నిర్వహించిన రాష్ట్ర రచయితల వర్క్ షాప్‌లో సన్యాసిరావు చివరిగా పాల్గొన్నారు. ఆయనది ప్రజల భాషలో పామరులకు సైతం అర్థమయ్యేలా పాటలు రాయడంలో అందవేసిన చేయి.

ఎంతో జటిలమైన రాజకీయ సమస్యలను సైతం సూటిగా విమర్శ చేయడం ప్రజలకు చేరువయ్యేలా పాటలకు బాణీలు కట్టడం, ఉత్తరాంధ్ర మాండలికపు జానపద శైలులను నేటి తరానికి పరిచయం చేయడం ఆయన ప్రత్యేకత. సమాజాన్ని చైతన్య పరచడానికి ఆయనకు అంధత్వం అడ్డు రాలేదు.

ప్రజా కళాకారునిగా, రచయితగా, వాగ్గేయకారునిగా ప్రజానాట్యమండలిలో ఆయన ప్రయాణం ఎంతో సుదీర్ఘమైనది. మాలాంటి యువతరానికి ఆయనతో పనిచేసిన అనుభవం తక్కువే అయినా ఆయన రచనల నుండి, ఆయన అనుభవాల నుండి అనేక విషయాలను పలు సందర్భాల్లో మేం తెలుసుకోగలిగాం. ప్రజా సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న ప్రతి రచయితకు సన్యాసిరావు చేసినటువంటి కృషి ఎంతో ఆదర్శనీయమైనది.

ప్రజా పాటల దార్శనికుడు సన్యాసిరావు

ప్రజానాట్యమండలి ముద్దుబిడ్డ కామ్రేడ్ సన్యాసిరావు. ఆయన ప్రజా పాటల ప్రయాణంలో అతనితో అత్యంత సన్నిహితంగా మెలిగిన వారిలో నేను ఒకడిని, నేను పాటలు రాయడానికి కూడా ఆయనే స్ఫూర్తి. పాటే ప్రాణంగా, తన గానమే ఊపిరిగా, ప్రజా సమస్యలు తన సమస్యలుగా భావించి తన పాటల ప్రవాహానికి నిత్యం కొత్తదారులు వెతికారు కామ్రేడ్ సన్యాసిరావు. ఆయన జీవితంలో పాటను అంతగా ప్రేమించారు కాబట్టే, కొన్ని వందల సమస్యలపై కొన్ని వేల పాటలు అలవోకగా రాయగలిగారు కామ్రేడ్ సన్యాసిరావు. పల్లె పాటైనా, పోరు గీతమైనా, యుగళగీతమైనా, ఉద్యమం ఏదైనా తన పదాల పొందికలో పాటల పుట్టాల్సిందే, పోరాటానికి ఊపునివ్వాల్సిందే. ఉత్తరాంధ్ర ప్రజానీకానికి పాటల సన్యాసిరావు అత్యంత సుపరిచితుడు. గిరిజన సమస్యలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తిదారులు, మత్స్యకారులు, మహిళలు, బాల కార్మికులు, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థి యువజన సమస్యలు, కుల వివక్షత, మతోన్మాద ప్రమాదం, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ, శాస్త్ర విజ్ఞానం, ఇలా అనేక సమస్యలపై తన పాటల బాణాలు సంధించారు కామ్రేడ్ సన్యాసిరావు. అర్ధరాత్రి, అపరాత్రి ఎండావాన, చలి వాతావరణం ఎలాంటి పరిస్థితుల్లోనైనా, తన ఆరోగ్యం సహకరించినా, సహకరించకపోయినా నిత్యం పాటలు రాయడానికి ఎప్పుడూ వెనకాడ లేదు. తన పాటలతో ఈ సమాజ మార్పునకు శక్తివంచన లేకుండా కృషి చేసిన ధన్యజీవి సన్యాసిరావు. ఇటువంటి సహజ కవులు అరుదు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజా కవులు, రచయితలకు నిత్యం స్ఫూర్తిని కలిగిస్తూనే ఉంటారు. ఆ కామ్రేడ్‌కు నివాళి అర్పించడమంటే, ప్రజా కళాకారులుగా ఆయన వదిలి వెళ్ళిన కర్తవ్యాన్ని, ఆశయాలను మరింత పదునుగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే.

-ఎం.చంటి, కార్యదర్శి,
ప్రజానాట్యమండలి, విశాఖ జిల్లా కమిటీ

ఉద్యమాల గొంతు మూగబోయింది

ఎక్కడ ప్రజా ఉద్యమాలు, పోరాటాలు జరిగినా నేనున్నానంటూ వచ్చి పాటలు పాడి ఆ ఉద్యమానికి జీవం పోసే ప్రజాకవి, గాయకుడు గంగిరెడ్ల సన్యాసిరావు మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు. విద్యార్థి, యువజన, మహిళ, కార్మిక, రైతు, మొదలగు ఏ ప్రజాఉద్యమాలు జరిగినా అక్కడ ముందుగా ఉండే వ్యక్తి సన్యాసిరావు. అప్పటికప్పుడే, అక్కడికక్కడే పాటలు రాసి, పాడి అందరినీ ఆకర్షించి, ఆయా సమస్యలపై స్పందించేలా చైతన్యవంతం చేయడంలో దిట్ట. కంటిచూపు లేకపోయినా వేరొకరి సాయంతో 300లకు పైగా పాటలు రాసి, ప్రజా ఉద్యమాలకు అంకితమిచ్చారు. సన్యాసిరావు రాసిన పాటలన్నింటినీ సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంకలనం చేసి పుస్తక రూపంలో ముద్రించింది. తనతో పాటు కుటుంబ సభ్యులను కూడా ప్రజా ఉద్యమాలలో భాగస్వాములను చేశారు. చివరివరకు ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన సన్యాసిరావు మన మధ్య లేకపోవడం బాధాకరం. అనారోగ్యంతో బాధపడుతున్నా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో పాల్గొని పాటలు పాడుతూ ఉద్యమానికి ఊతమిచ్చారు. సన్యాసిరావు మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు. ఆయన మృతికి సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

-ఆర్‌కెఎస్‌వి.కుమార్,
జిల్లా ప్రధాన కార్యదర్శి, సిఐటియు

ఉద్యమాల ఉమ్మడి ఆస్తి.. సన్యాసిరావు పాట

ఉద్యమకారుల కుటుంబంలో పుట్టిన గంగిరెడ్డి సన్యాసిరావు చివరివరకూ ప్రజానాట్యమండలి వెంటే నడిచాడు. ఎర్రజెండా భుజాన మోసేడు. వర్గ ప్రయోజనాల్నే స్వార్ధప్రయోజనాలుగా మార్చుకొని అనేక శ్రామిక జన ఉద్యమాలకు అంకితమయ్యాడు. అ బాటలో కవిత్వం రాసేడు, పాటలు పాడేడు. సన్యాసిరావు పేదల పక్షాన అక్షరాలను ఆయుధం చేసినవాడు, కష్టజీవుల కోసం పాటలు రాసినవాడు, ఉద్యమాల గొంతు ఎత్తినవాడు, అన్యాయాన్ని ప్రశ్నించిన వాడు. సమసమాజ ఆశయం కోసం స్థిరంగా నిలబడినవాడు, కుటుంబాన్ని ప్రేమించేవాడు, బాధ్యత గుర్తెరిగినవాడు, సిపిఎం కోసం పడి చచ్చేవాడు. తన తల్లిదండ్రులు నుంచి ఈయన కుటుంబమంతా ఎర్రజెండా ముద్దుబిడ్డలే. సన్యాసిరావు ప్రాణ స్పందన పాట. అందుకే...**'పాట నేనౌతా.. కోయలపాట నేనౌతా, నీతిపరుల త్యాగధనుల మాట నేనౌతా, ప్రజానాట్యమండలినై ప్రభలు చిందుతా, ప్రజల పనిపాటులలో పల్లవించుతా'** అని ఆకాంక్షతో ప్రజానాట్యమండలి నావికుడై, సైనికుడై సంస్థ అభివృద్ధికి శ్రమించాడు. కళ్ళు లేకపోయినా సమాజాన్ని చదివేడు, ప్రజల కష్టాన్ని చూసేడు. ప్రభుత్వరంగ రక్షణకు పాటల తూటాలు పేల్చేడు. వీధినాటికలు, నృత్యనాటికలు రాసి ప్రభుత్వ విధానాలను ఎత్తిచూపేడు. అక్షరజ్యోతి జాతాలో గ్రామగ్రామాన చదువు విలువ చాటేడు. నేను రాసిన అనేక వీధి నాటికలకు విప్లవ పాటలు జోడించాడు. నలభై సంవత్సరాలు ప్రజా నాట్యమండలిలో నేను అతనితో కలసి ఎన్నో జాతాలు, ఎన్నో ప్రదర్శనలు చేసాను. కళలలో మెలుకవలు నేర్చుకున్నాను. అది నా అదృష్టం. నిజానికి అయన ఓ ఆశుకవి. అడిగిన వెంటనే చక్కని యతిప్రాసలతో అక్షరాలు అల్లి, పదాలు చేర్చి నిమిషాల్లో పాట కట్టేస్తాడు. సన్యాసిరావు రాసిన 'నా కలం ప్రజాగళం' పుస్తకం చదివితే అందులోని అక్షరాల గారడీ అర్థం అవుతుంది, చరణాలు నుంచి ప్రవహించే చైతన్యం ప్రత్యక్షమవుతుంది. తను జీవశక్తిని కోల్పోతున్నా కవితాసక్తిని మాత్రం దూరం కాలేదు. నేనూ, ఎంవీఎస్, భాషా తదితరులు సన్యాసిరావును పరామర్శించడానికి తన ఇంటికి వెళ్ళినప్పుడు, అతను అనారోగ్యంతో ఉంటూనే మా అందరికీ పేరుపేరునా రెడ్ షెల్యూట్ చెప్పినప్పుడు నా కళ్ళు చెమర్చేయి. కామ్రేడ్స్ పట్ల ప్రేమ ఎంత మధురమో అర్థం అయింది. అదే సమయంలో అక్కడకు స్టీల్‌ప్లాంట్ నాయకులు ఒకరు వచ్చి ప్లాంట్ కోసం పాట అడగారు. వెంటనే శరీరం సహకరించకపోయినా, ఒంటినొప్పులు వేధిస్తున్నా, పల్లవి, మూడు చరణాలు చెప్పేసాడు. ఇక్కడే కాదు, అయన పాటలు తెలుగు రాష్ట్రాల్లో అనేకచోట్ల వినిపిస్తూనే ఉంటాయి. ఆయన మాట, పాటలు సమాజమార్పు కోసం శ్రమిస్తుంటాయి, మతోన్మాదాన్ని ఎదిరిస్తుంటాయి, ప్రపంచీకరణ మీద తిరగబడుతుంటాయి, అధిక ధరలుపై ఘోషిస్తుంటాయి, మహిళా సాధికారతను ఆకాంక్షిస్తుంటాయి.రైతుల కోసం యుద్ధం చేస్తుంటాయి. సన్యాసిరావు పునర్జన్మ అతని పాట. మనిషిగా మరణించవచ్చు, కానీ మరణించిన తర్వాత కూడా ప్రజల్లో బతకడం ఎర్రజెండా బిడ్డలకే సహజం. ఎప్పుడూ అతని భుజాన ఓ సంచి, అ సంచిలో కంజారి, అ కంజారి మోగిందా, విప్లవపాట వినబడుతుంది. అ పాట ఉద్యమాలకు ఊపిరి పోస్తుంది. సన్యాసిరావు పాట ఉద్యమాల ఉమ్మడి ఆస్తి. ఎర్రజెండాను దింపకుండా, కష్టజీవుల ఏజెండాను వదలకుండా తనదైన శైలిలో ముందుకు సాగిన ఉద్యమకవి సన్యాసిరావుకు నిజమైన నివాళి. అదే అతని ఆశయాలకు ప్రాణం పోయడమే.

-దండు నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షులు,
ప్రజానాట్యమండలి, విశాఖ జిల్లా కమిటీ

పాటలతో ఉద్యమాలకు ఊపిరి

అభ్యుదయ రచయిత, ప్రజా గాయకుడు కామ్రేడ్ సన్యాసిరావు మరణం ప్రజాసంఘాలకు, ప్రజానాట్యమండలికి తీరని లోటు. కళ కాసుల కోసం కాదు... ప్రజల కోసమని నమ్మి, అదే సిద్ధాంతం కోసం చివరివరకు పనిచేశారు.. అందరినీ చాలా ఆప్యాయతగా పలకరించే కామ్రేడ్ సన్యాసిరావు, ఉద్యమాల్లో పనిచేస్తున్న మహిళలను అమితంగా గౌరవించేవారు. మహిళా కళాకారులను విశేషంగా ప్రోత్సహించేవారు. కంటి చూపులేకపోయినా, నిత్యం పేపర్లను ఎవరితోనైనా చదివించుకుని, రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులకు అనుగుణంగా పాటలు రాయటం సన్యాసిరావు ప్రత్యేకత. రాసిన పాటలకు అప్పటికప్పుడు కంజరకొడుతూ బాణీలను సమకూర్చి పాడడం ఆయన ప్రత్యేకత. సన్యాసిరావు రాసిన పాటల్లో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే గొప్పదనాన్ని వివరిస్తూ రాసిన పాటలు ప్రత్యేకమనే చెప్పాలి. కామ్రేడ్ రాసిన పాటల్లో ప్రముఖమైనవి... 'కామ్రేడ్ శారదమ్మ మీకు జోహార్లమ్మ', 'మహిళలకు నేతవమ్మా నిన్ను మరువలేము మాయమ్మ', 'స్వాతంత్రం మనకెందుకు వచ్చింది'చ 'పాట నేనవుతా – కోయిల పాట నేనవుతా' 'నీతిపరుల మానధనుల – మాట నేనవుతా', 'జోహార్ గరికపాటి రాజారావు', 'గాలిది ఏ కులము ఈ నేలది ఏ కులము – మనిషికి ఎందుకు ఈ కులము', 'ఉత్తరాంధ్రమ్మ – ఓ ఉత్తరాంధ్రమ్మ' ' ఉత్తుత్తి పాలనలతో – ఉత్తి ఆంధ్ర వైతివమ్మా', 'సిఐటియు సంఘం పిలిచింది – కార్మిక వర్గపు ఐక్యతనే అది కోరింది', 'సిరివెన్నెలకు జోహార్లు', 'విశాఖ ఉక్కు చరిత్ర', 'ఉక్కు అభ్యుదయ కళా కోకిల' మొదలైన పాటలు పత్యేకతను చాటుకున్నాయి. ఉత్తరాంధ్రలో ఎన్నో సమస్యలకు పాటల రూపంలో ప్రజల్లో చైతన్యం కలిగించారు కామ్రేడ్ సన్యాసిరావు..

-బి.పద్మ, జిల్లా అధ్యక్షులు
ఐద్వా, విశాఖపట్నం

ఆటాపాటా నేర్పిన గురువు సన్యాసిరావు

సన్యాసిరావు చాలా మంచి వ్యక్తి. 1984 మేడే రోజున జనతా కాలనీలో కార్మిక జెండా ఆవిష్కరణ జరుపు తుండగా అక్కడికి నేను వెళ్ళాను. అక్కడ పాటలు పాడుతున్న ఆయనను చూసి ఆకర్షితుడినై అక్కడే నిలుచున్నాను. ఆయనే నా దగ్గరకు సన్యాసిరావు వచ్చి, నా వివరాలన్నీ తెలుసుకొని పాటలు పాడగలవా అని అడిగారు. 'నాకు నేర్చుకోవాలని ఉంది, మా చెల్లి వాళ్ళు భూమిభోగతం నాటిక వేస్తుంటారు, ఆ పాటలంటే నాకు ఇష్టం, నేనూ నేర్చుకుంటాను' అని సన్యాసిరావుతో చెప్పాను, ఆవిధంగా మా పరిచయం ఏర్పడింది. నేను అప్పటికే ఐఒసిలో పనిచేస్తున్నాను. ప్రతిరోజూ నా డ్యూటీ ముగిసిన వెంటనే జనతా కాలనీ, ఇండస్ట్రీ కాలనీలో ఉన్న తన అత్తగారింటి వద్ద ఉండగా, అక్కడకు వచ్చి పాటలు రాయించేవారు. సన్యాసిరావు చెబుతుండగా నేను పాటలు రాసేవాడిని. ఆ పాటలకు బాణీలు కట్టి అతను నేర్చుకున్నాక, నాకు నేర్పించేవారు. 1985లో ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా ప్రథమ మహాసభ మల్కాపురం ఏడుగుళ్ళ వద్ద జరిపాము. అప్పటినుండి 20 మంది ప్రజానాట్యమండలి కళాకారులతో ప్రతిరోజూ సాయంత్రం పూట మల్కాపురం తెలకల వీధి, వరహాల గ్యారెంటీ వద్ద నేర్చుకుంటుండే వాళ్లం. నేర్చుకున్న కళా రూపాలను వివిధ బహిరంగ సభల్లోనూ, పండగల్లోనూ, ఆదర్శ వివాహాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చేవారం. అలాగే సిఐటియు జనరల్ కౌన్సిల్ సందర్భంగా జోన్‌లోని పది మందితో డప్పుల దళంగా ఏర్పడ్డాం. విజయవాడ మహాసభల్లో ప్రదర్శన ఇచ్చాం. 1985, 1987ల్లో మేడే సందర్భంగా కోరమండల్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చాం. అక్షర జ్యోతి కార్యక్రమంలో నెల రోజులు పాటు చదువు ఆవశ్యకతపై సన్యాసిరావు రాసిన నిత్య రూపక ప్రదర్శనలిచ్చాం. ఢిల్లీలో సర్ధార్ హస్మి హత్యానంతరం హల్లా బోల్ వీధినాటికను మల్కాపురం జోన్ పరిధిలో వారం రోజుల పాటు 120 ప్రదర్శనలు ఇచ్చాం. కూలి పోరాటాలు, అక్షర జ్యోతి, సైన్స్ జాతాలలో సన్యాసిరావు, నేనూ కలిసి పనిచేశాం. సన్యాసిరావు రాసిన 'దుందుభి' ' నా కలం ప్రజాగళం' రెండు పాటల పుస్తకాలలో దాదాపు రెండు వేల పాటలనూ సన్యాసిరావు చెబుతుండగా నేను రాశాను. సన్యాసిరావు రాసిన పిట్టలదొర ఏకపాత్రాభినయం 800 ప్రదర్శనలు ఇచ్చాను. గంగవరం పోర్టు ఉద్యమంలో కాల్పులకు వ్యతిరేకంగా నృత్య ప్రదర్శనలిచ్చాం. ఈ విధంగా సన్యాసిరావు వద్ద నేను పాటలు, డాన్సులతో పాటు రాజకీయ తర్ఫీదు పొందాను. నేనీ స్థాయికి ఎదగడానికి మా గురువు సన్యాసిరావే స్ఫూర్తి.

– పైడిరాజు, సిపిఎం మల్కాపురం జోన్

సన్యాసిరావు అంతిమ వీడ్కోలు దృశ్యాలు

సన్యాసిరావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

సన్యాసిరావు పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తం అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సన్యాసిరావు కలం నుంచి జాలువారిన ఉత్తేజ గీతం

అసాధ్యం - అజేయం

ప!! అసాధ్యం అసాధ్యం ఎవరికైన అసాధ్యం
శ్రమజీవుల రక్తంతో వ్రాసిన చరితను చెరుపుట !!అసాధ్యం!!
అజేయం అజేయం ఎన్నటికీ అజేయం
మార్క్సు లెనిన్ ఆశయాల పునాదియౌ సోషలిజం !!అజేయం!!

చ!!1 తూర్పు నుండి సూరీడు పడమరకే నడుస్తాడు
ప్రకృతిలో ఎంత సత్యమో
ముందుకు నడిచే చరిత మెనుదిరిగి మరల బోదు
జగతిలోన నగ్న సత్యము !!అసాధ్యం!!

2.పుట్టినట్టి నదులన్నీ ఎన్ని మలుపులును తిరిగిన
సాగరమే వాటికి గమ్యం
శ్రామిక జన ఉద్యమాలు ఆటుపోటు లెదురైన
అంతిమ విజయం సోషలిజం !!అజేయం!!

3.ఆదిమ కాలము నుంచి అణుయుగానికొచ్చి మనిషి
ఆదిమానువుడుగ మారునా
రాతి ఆయుధాల నుంచి మరపిరంగులకు నడిచి
నాటి యుగానికే చేరునా !!అసాధ్యం!!

4.చీకటి కోణాల నుంచి వెన్నెల చవిచూసి మనిషి
నిశిరాత్రిని ఆశ్రయించునా
కొండ గృహాల నుంచి పెద్ద బంగళాలు కొచ్చి మనిషి
నాటి బ్రతుకునే కోరునా !!అసాధ్యం!!

5.అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతినడ్డుకొనుట
ఎంతటి మూర్ఖత్వమైనదో
ముందుకు నడిచే సమాజం వెనుకకు తిప్పాలనడం
చెప్పరాని పామరత్వము !!అసాధ్యం!!

6.ప్రపంచాధిపత్యానికి ప్రాకులాడు తుంటరోల్లు
రేపినట్లు అగ్ని జ్వాలలు
ఎవడు పెట్టిన చిచ్చు వాడితే దహించురోజు
ఎంతో దూరంలో లేదు !!అజేయం!!

7.యుగయుగాల హక్కుకాదు శ్రమ జీవుల అణించేందుకు
ఎంతటి సామ్రాజ్యవాదికీ !! అసాధ్యం!!
సమతకోరు మానవులకు సోషలిజం నిజగమ్యం
అజేయమౌ ఏనాటికీ !!అజేయం!!

జోహార్లు

పాటల ఊట ప్రవాహం ఆగిందా..
పాట నేనౌతనంటూ దివికేగిందా..
నీకలం నుంచి జాలువారిన ప్రజాపోరు గీతమే
కామ్రేడ్ సన్యాసిరావుకు పలుకుతుంది జోహార్లు

పాటలే ప్రాణంగా సాగావు సాహిత్య బాణమై
తెలుగునాట ప్రజలపాటలై వెలిగావు దీపమై
సందర్భం ఏదైనా బందిఖానలో ఉన్నా
పలుకరిస్తుంది నీ అక్షరం పాడుతుంది ఉద్యమ గీతం
కామ్రేడ్ సన్యాసిరావుకు పలుకుతుంది జోహార్లు

అంధత్వం అడ్డురాదు నీమనో విజ్ఞానా
మార్క్సిస్టు సిద్ధాంతం నీకు ఆలంబనా
నడిచావు పోరుబాట అయ్యావు ఉద్యమపాట
ఎత్తినావు ఎర్రజెండా కడదాకా గుండెల నిండా
కామ్రేడ్ సన్యాసిరావుకు పలుకుతుంది జోహార్లు

ఆదివాసీ హక్కులకై దళిత కులవివక్షలపై
కార్మిక కర్షక చట్టాలకై విద్యార్థి మహిళ రక్షణకై
రగిలించావు రాగమై వెలుగు పంచావు పున్నమినై
ప్రజానాట్యమండలిలో ప్రజా కళాకారుడవై
కామ్రేడ్ సన్యాసిరావుకు పలుకుతుంది జోహార్లు

- పి.బాలదేవ్



నీ పాటతో నీవెప్పుడూ సజీవమే

కామ్రేడ్ సన్యాసిరావూ!
ప్రజా పక్షపాతిగా
అలవోకగా నీవు రాసే పాట.. కూర్చే బాణి
పాడే తీరు
నిత్య నూతనం,

గంటల తరబడి పాడినా
బొంగురు పోని గొంతు
తగ్గని ఆ పదును
నీకు మాత్రమే స్వంతం,

ప్రతి పాటా చైతన్య గీతికే
సందర్భానుసారమే
ప్రజాకర్షణే
ప్రజాపక్షమే,

అంగ వైకల్యం నీకెన్నడూ
అడ్డు రాలే
ప్రజల కళ్ళతో
నిత్యం చూసే నీ చూపే
నీ పాటకు ప్రాణం
ప్రజా సమస్యలే నీ ఇతివృత్తాలు
అందుకే అవెన్నడూ
సజీవమే,

పార్టీ పట్ల అచంచల విశ్వాసం
ప్రజల మీద నీ నమ్మకం
మా మాటతోనే పోల్చేసి
కామ్రేడ్ అంటూ పేరు పెట్టి సంబోధించే
నీ జ్ఞాపక శక్తి
ఎలా మర్చిపోగలం కామ్రేడ్,

నీవెప్పుడూ నీ పాటతో
సజీవమే ....
అందుకో కామ్రేడ్
మా అరుణాంజలి.

- ఎ.అజ శర్మ

ఎలా పాడను నువ్వు లేని పాట

ఏమి వ్రాయను నీకోసం పాట
ఎలా పాడను నువ్వు లేని పాట
పాట రాసే కలము ఆగిపోయిందని రాయనా
పాట పాడే గొంతు మూగ
పోయిందని పాడనా

పల్లవి...
అందుకో అంజలి సన్యాసిరావు అంజలి
కన్నీటి వీడ్కోలు కడసారి అంజలి
ప్రజానాట్యమండలిలో పాట రాసి పాడావు
మార్క్సిస్టు పార్టీలో ఉద్యమించి నడిచావు
అలుపెరుగని నీ గొంతు ప్రజల చెంత చేరింది
ఉత్తేజం కలిగించి చైతన్యం చేసింది. .
.... అందుకో
ఏ పాట వ్రాసిన...... ఎక్కడ నువ్వు పాడిన
నీ పాట విన్న ప్రతి ఒక్కరు ఆలోచన చేశారు
సమస్యలు తెలియజేసి సాధించుట కోసం
నీ పాటను ఆయుధంగా
ఉద్యమించి కదిలే.... అందుకో

మానవాళి మనుగడకై మార్క్సిజన్ మార్గమని
నువ్వు నమ్మినట్టు సిద్ధాంతం పాటలుగా
మలచినావు
మొక్కవోని దీక్షతో ముందుకు నడిచావు
కానరాని లోకాలకు
కనుమరుగై పోయావు... అందుకో

ఆశయాల సాధనలో మేమంతా పయనించి
సమ సమాజ స్థాపన కై ఉద్యమించి కదిలితాం
నిజమైన నివాళి నీకదే కామ్రేడ్
ఎర్ర జెండా బాటలో పయనించి నడిచేము

- మౌలాలి
ప్రజానాట్య మండలి
విశాఖపట్నం

పాట మూగబోలేదు

పాట మూగబోలేదు గానం ఆగిపోలేదు
ప్రజా పాటల ప్రస్థానంలో చిరంజీవివే నువ్వు
ప్రజా కళాకారులకె పుడు
స్ఫూర్తినందిస్తావు
నీ స్ఫూర్తినందిస్తావు

ప్రజా కళాకారుడా జోహారులు..
సన్యాసిరావుకు నీరాజనాలు..
పాటను ప్రేమించావు
పాట కొరకు తపించావు
పాలకుల దుర్మార్గాలను
పాటతో ప్రశ్నించావు
ఉన్మాదుల ఘాతకాలను
పాటతో... కండించావు
కుట్ర కుతంత్రం చీకటి చీల్చే సూర్యడు
వైయ్యావు.....
ప్రజా కళాకారుడా జోహారులు...
సన్యాసిరావు నీరాజనాలు...

చాందస భావాలను నీవు పాతరేయాలన్నావు
శాస్త్రీయ ఆలోచనలు
పాటలలో జొప్పించావు
ప్రజల భాషలో పాటలు రాసి బాణీ కట్టి
పాడావు
ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డవై మామదిలో
నిలిచేవు

ప్రజా కళాకారుడా జోహారులు... సన్యాసి
రావు నిరాజనాలు
.బడుగుల బాధకు నీ పాట ధైర్యాన్ని ఇచ్చింది
పోరాటాలను నీ పాట ఉత్తేజపరిచింది
దోపిడి పై నీ పాటతో పిడుగులు కురిపించేవు
ఎర్రని జెండాలో నువ్వు
చుక్కై మెరిసినావు
ప్రజా కళాకారుడా జోహారులు... సన్యాసి
రావు నిరాజనాలు

- ఎం. చంటి, ప్రజానాట్యమండలి

సన్యాసిరావు విద్యార్థి దశ నుంచే పరిచయం

సన్యాసిరావు తనకు విద్యార్థి దశ నుండి పరిచయం ఉన్నది. గత 30 సంవత్సరాలుగా ఆయనతో కలిసి అనేక చోట్ల పాల్గొన్నాము. పాయకరావుపేటలో జరిగే తమలపాకు కార్మిక ఉద్యమంలో గానీ, వ్యవసాయ కూలీల సమస్యలపై గాని, రైతాంగ పోరాటంలో కలిసి పని చేసాము. తన ఉద్యమంలో ఆయన పాటలు చైతన్యాన్ని నింపాయి. గంగవరం పోరాటంలో కూడా కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి వ్యక్తి చనిపోవడం బాధాకరం. నా కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తున్నాను. కష్టపడి పనిచేసే స్వభావం కలిగిన వ్యక్తి. చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వ్యక్తి. ఇన్ని కష్టాలు వచ్చినా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారు.

- ఎం రాంబాబు,
సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి





సన్యాసిరావు ఆశయాన్ని కొనసాగించడమే నిజమైన నివాళి

ఆంధ్ర ప్రజానాట్యమండలి ప్రథమ రాష్ట్ర మహాసభలు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగాయి. ఆ మహాసభలకు నేను వాలంటీర్‌గా ఆరుద్ర గారికి సహాయకారుడిగా పని చేశాను. అప్పటికే కామ్రేడ్ సన్యాసిరావుతో కొద్దిపాటి పరిచయం ఉంది. నాటి నుండి సుదీర్ఘకాలం పాటు సన్యాసిరావుతో కలిసి ప్రజానాట్యమండలిలో పనిచేసే అవకాశం నాకు లభించింది. అప్పటికి నేను నిరుద్యోగిని. 1985లో నా వివాహం తరువాత మల్కాపురంలోనే నివాసం ఉండటం వల్ల సన్యాసిరావుకి మరింత చేరువయ్యాను. అనేక వేదికలు, అనేక మహాసభల్లో సన్యాసరావుకు తోడుగా వెళుతూ ప్రతి పాటలో కోరస్ గాయకుడిగా పాడేవాడిని. "పండగ పది రోజులుంది పప్పలండు పెళ్లమా?" లాంటి అనేక పాటలు ఆయన రాశారు.

ప్రతిరోజూ మాలో ఎవరో ఒకరి చేత పేపరు చదివించుకొని పత్రికలో వచ్చిన సమస్యలపై అప్పటికప్పుడు అవలీలంగా మాతో పాట రాయించేవారు. 1987లో ఖమ్మంలో జరిగే ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలకు ఒక కొత్త కళారూపాన్ని మనమే తయారు చేసుకోవాలి అని సన్యాసిరావు నాతో చెప్పారు. అప్పుడు డాక్‌యార్డ్‌లో పనిచేసే జివివి.సత్యనారాయణ, నేను, సన్యాసిరావు ప్రతిరోజు రాత్రిపూట కూర్చుని నాటిక రచించాం. స్త్రీ అణచివేత, పురుషాధిక్యతకు మనవాళ్లు ముద్దుగా పెట్టుకున్న పేరు సాంప్రదాయం. అటువంటి సాంప్రదాయం గుట్టు రట్టు చేస్తూ జనాల్ని ఆలోచింపచేసే విధంగా 'సాంప్రదాయమా నీకు జోహార్లు!' అనే నాటిక రచన చేశాం. ఈ నాటిక మల్కాపురం, మింది, గాజువాక ప్రాంతాలతో పాటు ఖమ్మం రాష్ట్ర మహాసభల్లో ప్రదర్శించి అనేకమంది ప్రశంసలను పొందడం జరిగింది.

కామ్రేడ్ సన్యాసిరావు కంటికి వచ్చిన జబ్బు పేరు రేట్నిటిజం పిగ్మెంటోజలి. ఇది నయం కాని వ్యాధి. మందు కనిపెట్టబడలేదు. అమెరికా వాళ్ళు ఏదో సిలికాన్ కనిపెట్టారని సమాచారం తెలిశాక మద్రాసులో ఉన్న శంకర్ పౌండేషన్ హాస్పటల్‌కు ఆయనకు సహాయకారుడిగా వెళ్లే అవకాశం నాకు కలిగింది. అక్కడ ఆసుపత్రి వాళ్ళు కూడా ఇది నయం కాదని తేల్చి చెప్పేశారు. రోజురోజుకీ చూపు మరింత మందగిస్తుందని వారు తెలియజేశారు. కానీ సన్యాసిరావు మెదడు మాత్రం రోజు రోజుకి చాలా చురుగ్గా పనిచేసేది. ప్రతిరోజూ పేపరు చదివించుకుంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, పాలకుల విధానాల్ని ఎండగడుతూ అనేక పాటలు రాశారు. ఆయన రాసిన పాటలను పుస్తకం ద్వారా ప్రచురించడం జరిగింది.

ఆయన రచన శైలి ప్రతి సామాన్యుడు పాడుకునే విధంగా, ప్రజలను ఆలోచింపజేసే విధంగా, కష్టజీవులను ఐక్యపరిచే విధంగా, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా ఉండేవి. రాష్ట్రంలో రచయితలు, గాయకుల వర్క్‌షాప్‌లో ఆయన గేయం, ఆయన పాత్ర లేకుండా ఏ వర్క్‌షాపు జరగలేదు. తిరుపతిలో జరిగిన ఆలాపన కార్యక్రమంలో ఆయన రచించిన అద్భుతమైన పాట ఆలాపన వేదికపై పాడటం జరిగింది. అటువంటి సన్యాసిరావు మన మధ్య లేకపోవడం ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా ఉద్యమానికే కాదు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీకి, కార్మిక, ప్రజాసంఘాలకు, పేదలు, కష్టజీవుల ఉద్యమాలకు తీరని లోటు. అటువంటి మహనీయుడికి నివాళులర్పించడం అంటే ఆయన చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటిస్తే సరిపోదు. ఆయన ఆశయాన్ని కొనసాగిస్తూ కష్టజీవుల సమస్యలు పట్ల నిత్యం స్పందించాలి. ఇదే మనం ఆయనకు మనం ఇచ్చే నిజమైన గౌరవ నివాళి. బతికినంత కాలం ప్రజల కోసం పనిచేస్తూ చివరికి మరణించిన తర్వాత తన దేహాన్ని సైతం వైద్య విద్యార్థులకు పరీక్షల నిమిత్తం అప్పగించి తన గొప్పతనాన్ని ప్రదర్శించిన మహానుభావుడు కామ్రేడ్ సన్యాసిరావు. ఆయన ఆశయాన్ని చివరి కోరికను మన్నించి పాటించిన కుటుంబ సభ్యులకు నా ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను.

- వై.అప్పారావు,
ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు

గొప్ప ప్రజా కళాకారుడు

- జి.రమణ,
ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా అధ్యక్షులు

గొప్ప ప్రజా కళాకారుడు కామ్రేడ్ జి.సన్యాసిరావు. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాతంత్ర ఉద్యమ బాధ్యులకు, కళాకారులకు సుపరిచితుడు. ఆయనలా గుర్తింపు పొందడానికి ఆయన రాసిన పాటలు, రచనలే కారణం. ఆయన స్పందించి పాటలు రాయని రంగం లేదు. ఆయన గళం నుంచి ప్రజా సమస్యపై పాడనిపాట లేదు. ఆయన కలం నుంచి జాలువారిన అక్షరాలు ఎన్నో పోరాటాలకు ఉత్తేజకాలు. ఆయన బాల్యం విశాఖ జిల్లా ఉద్యమంలో నిర్మాతలుగా ఉన్న వైదాడ ధర్మారం, లచ్చన్నగారి వద్ద సాగింది. నాడు మల్కాపురం గొల్లలపాలెం ప్రాంతంలో బాలల సంఘాలు పనిచేసేవి. ఈ ప్రాంతంలో ఉదయాన్నే మేలుకొలుపు అనేది దేవుడు పటాలతో ఉండేది. ఆ పద్ధతికి భిన్నంగా ఆ కాలంలోనే జి.సన్యాసిరావు పళ్లెంలో సుత్తి కొడవలి చిత్రాన్ని పెట్టుకొని పిల్లలందరినీ పోగేసి గ్రామం అంతా మేలుకొలుపు చేసేవారు. రచయితగా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలే కాకుండా సామాజిక విషయాలు, చదువు, అంటరానితనం, బాల్య వివాహాలు, చెట్ల పెంపకంపై స్క్రిప్టులు, పాటలు రాశారు. ఒక సందర్భంలో ఆయన రాసిన చెట్టుపై పాటను కర్ణాటకలో తర్జుమా చేసుకొని అక్కడి అధికారి ఆ రాష్ట్రంలో పాడించుకున్నారు. సన్యాసిరావు ఉత్తరాంధ్రలో అనేక గ్రామాలు తిరిగారు. ప్రజానాట్య మండలి దళాల ఏర్పాటుకు కృషి చేశారు. అనేక శిక్షణ శిబిరాలకు హాజరయ్యారు. ఎంతోమందిని శిష్యులుగా తయారు చేశారు. ఒక సందర్భంలో మత్స్యకారుల సమస్యలపై పాటలు రాస్తూ.. ఎన్నో రకాల చేపల పేర్లు, వాళ్ల జీవన విధానం.. ఇలా అన్నీ కలిపి ఒక పాట రాశారు. అద్భుతమనిపించింది. ప్రతి విషయంలో ఆయనకున్న పరిజ్ఞానం చాలా గొప్పది. సన్యాసిరావును ఒక ధర్నా వద్ద ఉదయాన్నే దించి సాయంత్రం మనం వచ్చేసరికి పది మందితో ఒక దళాన్ని తయారు చేసి రెడీగా ఉంచేవారు. అప్పటికప్పుడు సమస్యపై పాట రాయడం, నేర్పించడం, పాట పాడే వారిని గుర్తించడం, కోరస్ ఇచ్చే వారికి నేర్పించడం, కంజర, డప్పు కొట్టడం.. ఇలా అన్ని పనులూ ఒకే సమయంలో చేసేవారు. ఎప్పుడూ ఆయన సంచిలో ఒక కంజర, సిగరెట్ పెట్టె ఉండేవి. కళ్లు కనిపించకపోయినా ప్రతిరోజూ ప్రజాశక్తి వార్తలను ఆయన తెలుసుకునేవారు. పేపర్ వచ్చిన వెంటనే ఆయన భార్యను దగ్గర కూర్చోబెట్టుకుని, చదివించుకుని, రాజకీయ విషయాలను అవగాహన చేసుకుని, వెంటనే ఆయన స్పందనతో ఒక పాట రాస్తానని చెప్పి మరీ రాసేసేవారు. ఆయన రాసే పాటలు ప్రజలు పాడుకునేవిగా, వాడుక భాషలో ఉండేవి. ఉత్తరాంధ్ర మాండలికాన్ని కలుపుతూ చాలా సులువుగా అర్థమయ్యేలా ఆయన పాటలు సాగేవి. ఆయన బిహెచ్‌పివిలో ఉద్యోగిగా ఉన్న సమయంలో టీ బ్రేక్ టైంలో కూడా వెళ్లి అప్పటికప్పుడు పాటలు రాయించి తీసుకొచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. సోవియల్ రష్యా కూలిన దశలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజానికి, సోషలిజానికి కాలం చెల్లింది అనే రోజుల్లో సన్యాసిరావు గారు రాసిన ఒక పాట ఉద్యమకారులను చైతన్యం చేసింది. అదే అజేయం.. అజేయం.. సోషలిజం.. అజేయం.. అసాధ్యం అసాధ్యం.. ఎవరికైనా అసాధ్యం.. శ్రమజీవుల రక్తంతో రాసిన చరితను చెరుపుట అసాధ్యం.. పుట్టినిట్టి నదులన్నీ ఎన్ని మలుపులు తిరిగినా.. సాగరమే వాటికి గమ్యం.. శ్రామిక జన ఉద్యమాలు ఆటుపోటులెదురైనా అంతిమ విజయం సోషలిజం.. పాట. ఆయన నుంచి నేర్చుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయి. పాటలు రాసే విధానం, ఎక్కువ సమయాన్ని ఉద్యమానికి కేటాయించడం, అంగ వైకల్యాన్ని సైతం పక్కనపెట్టి ఉద్యమాల్లో పాల్గొనడం ఆయనలోని స్ఫూర్తినిచ్చే అంశాలు

సన్యాసిరావు ప్రజా పాటల భాండాగారం

బాషా, ప్రజానాట్యమండలి పూర్వ రాష్ట్ర అధ్యక్షులు

మా ఇద్దరిదీ ఉద్యమ బంధం. దాదాపు అర్ధ శతాబ్దపు కాలపు అనుబంధం. ప్రజాపాటలో పల్లవి.. అనుపల్లవి లాంటి స్వర బంధం మాది. సన్యాసిరావు చిన్నతనం నుంచే వామపక్ష భావజాలానికి అకర్షితుల య్యారు. దానికి కారణం ఆయన పుట్టి, పెరిగిన ప్రాంత వాతావరణం. మల్కాపురం. నాడు మల్కాపురం పారిశ్రామిక ప్రాంతాన్ని మాస్కోవాడ అనేవారు. అది కమ్యూనిస్టుల అడ్డా. వామపక్షాల గడ్డ. ఆ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సన్యాసిరావు అంతిమ శ్వాస వరకూ ఎర్రజెండా నీడలోనే నిలిచారు. విద్యార్థి దశ నుంచే యువజన సంఘాలు.. గ్రామ కమిటీలలో చురుకుగా పాల్గొనేవారు. ఆయా కార్యక్రమాల్లో ఆట – పాటలతో ప్రారంభమై కళారంగం పట్ల ఆసక్తితో నృత్యాలు. నాటికలు, వాలకాలు, ఇత్యాది కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రజాపక్ష చైతన్యంతో ప్రజాకళాకారునిగా సన్యాసిరావు ఎదిగారు. ఆనాడు ఎమర్జెన్సీ కాలంలో ప్రజాతంత్ర ఉద్యమంపై తీవ్ర నిర్బంధం ఉండేది. బహిరంగంగా కళా ప్రదర్శనలపై సదస్సులు, సమావేశాలు జరపడంపై ఆంక్షలు అనేకం. అయినా ప్రజానాట్య మండలి చాప కింద నీరులా జన చైతన్యానికి తన వంతు కృషి చేసింది. అత్యవసర పరిస్థితి అనంతరం ప్రజానాట్య మండలి విశాఖలో విస్తరణ వేగాన్ని పెంచుకుంది. పారిశ్రామిక నగరంలో ప్రజా సాంస్కృతిక సౌరభాన్ని నలుమూలలకు వ్యాప్తి చెందించింది. విశాఖలోని అన్ని పరిశ్రమల్లోకి ప్రజా నాట్యమండలి విస్తరించింది. కళాకారులను తయారు చేసింది. పెదవాల్తేరు, సుందరయ్య నగర్, హెచ్‌బి.కాలనీ, మద్దిలపాలెం, మధురవాడ, భీమిలి, మర్రిపాలెం, మాధవధార, కంచరపాలెం, గోపాలపట్నం, సబ్బవరం, అనకాపల్లి, కశింకోట, హరిపాలెం, తిమ్మరాజుపేట, మల్కాపురం, శ్రీహరిపురం, గోలీలపాలెం, మింది, గాజువాక, సుందరయ్య కాలనీ.. ఇలా నాడు దాదాపు 30 ప్రజానాట్యమండలి దళాలు ఉండేవి. ఈ దళాల నిర్మాణంలోనూ, వాటికి కళారూపాల శిక్షణలోనూ సన్యాసిరావు కీలకపాత్ర పోషించారు. ఇక ఆయన రచనలు, పాటల విషయానికి వస్తే సన్యాసిరావు మస్తిష్కమంతా పాటలమయం.. ప్రజాపాటల భాండాగారం. అనంత సాహితీ ప్రస్థానం సన్యాసిరావుది. ప్రజాపాటల రహదారిలో అలుపెరుగని బాటసారి సన్యాసిరావు.